


# నేటిధాత్రి®
తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

శుక్రవారం 02-10-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 166 రూ॥ 6.00


# బీసీలు బిచ్చగాళ్ళు...

# ఓసీలు వడ్డించే వాళ్ళు!

ఎక్స్‌క్లూసివ్ నేటిధాత్రి Exclusive



- ఇండిపెండెంట్ గా ప్రొఫెసర్ నాగేశ్వర్ గెలవలేదా!
- తీన్మార్ మల్లన్న గెలవలేదా!
- మల్కకొమురయ్య విజయం సాధించలేదా!

## బీసీల మీద రాజకీయం..ఓసీలకు అధికారం






- మండలి పునరుద్దరించినప్పటి నుండి టిక్కెట్లు ఓసీలకే ఇవ్వడం జరిగింది.
- ఉమ్మడి నల్లగొండ నుండి కపిలవాయి దిలీప్ కుమార్
- తర్వాత వరదారెడ్డి, పల్లారాజేశ్వర రెడ్డి, ఇప్పుడు రాకేష్ రెడ్డి.



- కాంగ్రెస్ నుంచి జీవన్ రెడ్డి వద్దనుకుంటే మళ్ళీ రెడ్డికే టిక్కెట్ ఇవ్వలేదా!
- ఇప్పుడు కూడా కాంగ్రెస్ రెండు చోట్ల ఓసీ లకే ఇవ్వడం భావ్యమా!




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


- కాంగ్రెస్ కూడా అదే దారిలో నడిచింది.
- బీజేపీ ఓసీ లకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది.
- బడుగుల ఓట్లా..ఓసీ లకు సీట్లా!
- పార్టీలు ఏవైనా సరే టిక్కెట్లు ఓసీ లకు మాత్రం కామనేనా!
- సామాజిక న్యాయానికి మంగళమేనా..
- అన్ని పదవులకు ఓసీలు మాత్రమే అర్హులా?
- ఏ ఎన్నికలొచ్చినా ఓసీ అభ్యర్థులేనా!
- అన్ని పార్టీలు అంతేనా.. బీసీలకు ఎప్పుడూ అన్యాయమేనా!

- గెలుస్తామనుకునే ప్రతి సారి ఓసీ లకే టిక్కెట్లా!
- ఓడిపోతామనుకున్నపుడు బీసీ లకు టిక్కెట్లా!
- బీసీలకు ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటారా!
- బీసీ లకు ఇవ్వడం వల్లనే ఓడిపోయామని చెవుల్లో పువ్వులు పెడతారా!
- నామినేట్ ఎమ్మెల్సీ లు అయినా ఓసీ లకే ప్రాధాన్యత కల్పించలేదా!
- మండలిలో ఎంత మంది బీసీలు న్నారో లెక్కేయండి.
- దమాషా లెక్కను అటకమీద పడేయండి.

## బీసీల ఐక్యత ను దెబ్బ కొట్టండి.

- బీసీలు ప్రశ్నిస్తే ఊస్టింగులు.. ఓసీ లు ప్రశ్నిస్తే పదవులు.
- బీసీ లు బలవంతులు కావొద్దు.. ప్రశ్నించే స్థాయి కి ఎదగొద్దు!



హైదరాబాద్, నేటిధాత్రి:

బిసిలు ఎప్పుడూ రాజకీయ బిచ్చగాళ్లేనా? బలమున్నా పార్టీల అధినేతలకు, పెద్దలకు భయపడాల్సిందేనా? నోరున్నా కట్టడి చేసుకోవాల్సిందేనా? తమ అభిప్రాయాలను కూడా మనసులో సమాధి చేసుకోవాల్సిందేనా?పార్టీల జెండాలు మోయడానికి మాత్రమే ముందుండాలా? అర్ధరాత్రుల్లు పార్టీ జెండాలు కట్టేందుకు నిద్రాహారాలు మానుకొని పనిచేయాలా? పదవులు ఆశించకూడదా? పార్టీలో బిసి నాయకుల పనితనం పదవుల దాకా రావొద్దా? అంటే ఏ పార్టీ రాజకీయ చరిత్ర చూసినా సరే ముందుగా ఓసిల పేర్లు రాసుకుంటారు. ఇక తప్పదనుకున్నప్పుడు, ఆ సీటు ఓడిపోతుందనుకున్నప్పుడు మాత్రమే బిసిలకు ఏ టికెట్ అయినా ఇస్తారా? అంటే అవుననే సమాదానమే అన్ని సందర్భాలలో కనిపిస్తుంది. అసెంబ్లీ టిక్కెట్లు ఎలాగూ బిసికి ఒక్క టికెట్ ఇస్తే ఓసిలకు ఆరు టిక్కెట్లు ఇస్తారు. ఓ నలుగురు బిసిలను ఎంపిక చేస్తే నలభై మంది ఓసిలను ఎంపిక చేస్తారు. ఇది ఆ పార్టీ ఈ పార్టీ అని తేడా లేదు. సమాజంలో 55శాతం వున్న బిసిలకు రావాల్సిన దామాషా ఎప్పుడూ అందదు కాని సామాజిక న్యాయం అనే బోర్డు మాత్రం ప్రతి పార్టీలో పెట్టుకుంటారు. వేదికలెక్కినప్పుడు చెబుతుంటారు. ప్రతిపక్షంలో వున్నప్పుడు పదే పదే చెబుతారు. కాని తీరా ఎన్నికల సమయానికి మాత్రం ఓసిలను ఎంపిక చేస్తారు. బిసిల నోరు మూయిస్తారు. ఎందుకంటే తక్కువ జనాభా వున్న ఓసిలలో వుండే ఐక్యత ఎక్కువ జనాభా వున్న బిసిలలో లేదు. అది సాద్యం కాదు? అని ఎప్పుడో రాజకీయ పెద్దలైన ఓసిలు ముద్ర వేశారు. కులాల మధ్య చిచ్చులు పెట్టారు. బిసిల మధ్య కనిపించని ఆదిపత్యం ఉసిగొల్పారు. దాంతో బిసిలమంతా ఒక్కటే అని మాటలు చెప్పిస్తారు. కులాల మధ్య దూరం పెంచుతారు. ఇదే ఓసిల అసలైన రాజకీయం. అందుకు బిసిలకు టిక్కెట్లు ఇవ్వడానికి ఇష్టపడరు. ఓసిలలో ఎవరికి ఇచ్చినా అందిరినీ ఒప్పిస్తారు. బిసిలలో ఒకరికి ఇచ్చి మరో కులాన్ని ఎగదోస్తారు. ఒక రకంగా చెప్పాలంటే చాట్ల తవుడు పోసి కుక్కల కొట్లాల చేస్తారు. ఎందుకంటే రాజకీయాల్లో నైతికత ఎనాడో చచ్చిపోయింది. నీతి ధర్మం అనే పదాలు అంతరించిపోయాయి. ఓసిలు ఆధిపత్యం చేయాలి. రాజకీయం చేయాలి. పదవులు పొందాలి. బిసిలు బానిసలుగా వుండాలి. ఓసిల పల్లకి మోయాలి. ఓసిలను తమ ఓట్లతో గెలిపించాలి. ఓసిలను కుర్చీలలో కూర్చోబెట్టాలి. బిచ్చగాళ్లలా బిసి సబ్ ప్లాన్ అమలు చేయండి? ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వండి. బ్యాంకుల లోన్ ఇప్పించండి. అంటూ ఓట్లేసి గెలిపించిన నాయకులకు చుట్టూ ప్రదక్షణలు చేయాలి. ఆ ఓసి నాయకులు తిట్టిన పడాలి. కొట్టినా పడాలి. ఊడిగం చేయాలి. జనం ముందు ఆ నాయకుడికి జేజేలు కొట్టాలి. ఇదేనా బిసిలకు రాజకీయ పార్టీలు ఇచ్చే గౌరవం. ఏ నాయకుడికైనా సరే పదవులే గౌరవం. అందుకే పదవులన్నీ ఓసిలకు ఇస్తారు. గెలిపించే బాద్యతలు మాత్రం బిసిల మీద పెడతారు. ఏ ఎన్నిక వచ్చినా ముందు ఓసిల వైపు చూస్తారు. వాళ్లకే టికెట్లు ఇస్తారు. సామాజిక న్యాయానికి ఎప్పుడో మంగళం పాడేశారు. కాని రాజకీయ పార్టీలకు అవసరం వచ్చినప్పుడు మంగళ హారతి ఇచ్చినట్లు బిసిల పాట పాడుతుంటారు. నైవేద్యం మాత్రం ఓసిలు పంచుకుంటారు. మండలి పునరుద్దరించిన నాటి నుంచి అటు గవర్న కోట నుంచి గాని,ఇటు ఎమ్మెల్యేల ఓట్లనుంచి, గాని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ముందుకు ఎంపిక ప్రక్రియ ఓసిల నుంచే మొదలు పెడతారు. ఇప్పుడు మళ్లీ తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్దమైంది. కాంగ్రెస్ పార్టీ రెండు స్దానాలకు రెడ్డి అభ్యర్ధులనే ఎంపిక చేసింది. అంటే కనీసం ఒక్క సీటులో కూడా బిసి నాయకులు లేరా? కాంగ్రెస్ భూతద్దం పెట్టి వెతికినా కనిపించ లేదా? కాంగ్రెస్ అభ్యర్ధుల్లో సామా రామ్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే పార్టీలో కీలకమైన బాధ్యతలో వున్నారు. అన్ని చోట్ల ఆయనే కనిపిస్తుంటారు. ముఖ్యంగా మీడియా అదికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిన్నారు. అంటే పార్టీ పదవి విషయానికి వస్తే ఆయనకే ఇచ్చారు. ఇప్పుడు ఎమ్మెల్సీ టికెట్ కూడా ఆయనకే ఇచ్చారు. ఇక నల్గొండ నుంచి సర్వోత్తం రెడ్డిని ఎంపిక చేశారు. సర్వోత్తం రెడ్డి కుటుంబం నుంచి రాం రెడ్డి దామోదర్‌రెడ్డి, రాంరెడ్డి వెంకటర్‌రెడ్డిలు కొన్ని దశాబ్దాల పాటు జిల్లాను ఏలారు. అనేక సార్లు ఎమ్మెల్యేలు అయ్యారు. మంత్రి పదవులు కూడా అందుకున్నారు. బిసి నాయకత్వాలు ఎదగకుండా దశాబ్ధాలుగా ఏలుతున్నారు. ఇప్పుడు మళ్లీ అదే కుటుంబానికి ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చారు. ఈ మధ్య జరిగిన కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీని కూడా ఆల్‌పోర్స్ నరేందర్‌రెడ్డికి ఇచ్చారు. ఆ సీటు మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వద్దనుకున్నారు. అయినా ఓసినే ఎంపిక చేశారు. బిసిలవైపు చూడలేదు. బిజేపి గతంలోనూ ఓసిలకే ప్రాదాన్యతనిస్తూ వచ్చింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డిని పోటీకి దింపింది. గతంలో ఎన్నం శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్‌ను ంచి రంగంలోకి దింపింది. ఇక పదేళ్లపాటు తెలంగాణను ఏలిన బిఆర్‌ఎస్ ఉద్యమ కాలం నుంచి కూడా ఓసిలకే ప్రాదాన్యత నిస్తూ వచ్చింది. తొలిసారి పట్టభద్రుల ఎన్నికలు జరిగినప్పుడు బిఆర్‌ఎస్ ఓసి అయిన కపిలవాయి దిలీప్ కుమార్‌కు ఇచ్చారు. గెలిపించుకున్నారు. అలా రెండు సార్లు ఆయనకు అవకాశం కల్పించారు. తర్వాత ఆయన పార్టీ నుంచి వెళ్లిపోతే విద్యాసంస్థల అదినేత వరదారెడ్డికి పట్టభద్రులు ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చారు. కాకపోతే ఆయన గెలవలేదు. తర్వాత వచ్చిన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డికి ఇచ్చారు. ఆయన రెండుసార్లు ఎమ్మెల్సీ అయ్యారు. అటు ఎమ్మెల్సీగా వుండగానే అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి టికెట్ ఇచ్చారు. పల్లా రాజీనామాతో ఖాళీ అయిన పట్టభద్రుల స్దానం నుంచి రాకేష్‌రెడ్డికి అవకాశమిచ్చారు. ఆయన ఓడిపోయారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికలు వచ్చాయి. టికెట్ మళ్లీ రాకేష్‌రెడ్డికే ఇస్తున్నారు. ఒకసారి రాకేష్‌రెడ్డి ఓడిపోయారు. ఇచ్చిన అవకాశాన్ని ఆయన జార విడుచుకున్నారు. బిఆర్‌ఎస్ అదికారంలో వున్నా ఆయన గెలవలేకపోయారు. ఇప్పుడు మళ్లీ ఆయననే ఎంపిక చేశారు. కాని అదే స్దానంలో ఓ బిసి వుంటే ఎంపిక చేసేవారా? బిసికి ఇస్తే ఓడిపోతామనే సంకేతాలు కూడా బలంగా పంపేవారు కాదా? గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మహబూబ్ నగర్ నుంచి మాజీ ప్రధాని పివి. నర్సింహారావు కూతురు వాణీదేవికి ఇచ్చారు. అలా ఏ బిసి నాయకుడి వారసుడికి ఇచ్చేవారా? గెలిపించుకునేవారా? బిసిలలో బలమైన నాయకులు లేరా? వున్నా వాళ్లను లెక్క చేయరా? ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రొపెసర్ నాగేశ్వర్ రెండు సార్లు ఇండిపెండెంటుగా పోటీ చేసి ఎమ్మెల్సీగా గెలవలేదా? రాజకీయ పార్టీలన్నీ మూకుమ్మడిగా ఆయన మీద పోటీ చేసినా నాగేశ్వర్ గెలిచి బిసిల సత్తా చాట లేదా? అయినా అలాంటి వాళ్లు పార్టీలకు వద్దు. రాజకీయ పెద్దలను, పార్టీలను నిలదీసి, హక్కుల కోసం పోరటం చేసే వారిని పార్టీలు పక్కన పెడతాయి. ఒక జర్నలిస్టు స్దాయి నుంచి ఇండిపెండెంటుగా పోటీ తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ కాలేదా? అయినా బిసిలకు ఇవ్వరు. తెలంగాణ వచ్చిన తర్వాత వచ్చిన తొలి ఎన్నికల్లో మునుగోడు నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా పోటీచేసిన కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓడిపోయారు. అంతకు ముందుకు భువనగిరి పార్లమెంటు సభ్యుడిగా వున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. తర్వాత వచ్చిన స్ధానిక సంస్ధల ఎన్నికలలోనూ రాజగోపాల్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. ఆయనే గెలిచారు. ఆ తర్వాత వరంగల్ స్ధానిక




సంస్ధల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి బిఆర్‌ఎస్ టికెట్ ఇచ్చింది గెలిపించుకున్నది. నిజామాబాద్ పార్లమెంటు సభ్యురాలిగా మొదటిసారి గెలిచి, రెండోసారి ఓడిపోయిన కవితను వెంటనే ఎమ్మెల్సీని చేశారు. స్దానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవం చేసి గెలిపించారు. అంటే సునాయాసంగా గెలవాలన్నా ఓసిలకే టిక్కెట్లు? పార్టీ ఖర్చులన్నీ భరించి గెలిపించాలన్నా ఓసిలకే టిక్కెట్లు? ఇక తప్పదు ఓడిపోయే పరిస్ధితిలు స్పష్టంగా కనిపించినప్పుడు మాత్రమే బిసిలకు అప్పుడప్పుడూ టిక్కెట్లు? ఇదే రాజకీయ పార్టీలు ఆడుతున్న పుంజీతం. ఆ ఆటలో బిసిలకు ఆత్మ గౌరవం వుండదు. టిక్కెట్లు దక్కవు.



నేటిధాత్రి
నిష్పక్షపాత వార్తల నిలయం
22ND ANNIVERSARY
తెలుగు వార్త పత్రిక



శుక్రవారం 02-10-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 166 రూ॥ 6.00


## రేవంత్ ఏ పార్టీలో అడుగుపెడితే

# ఆ పార్టీ మటాష్

### తెలుగుదేశాన్ని దెబ్బతీశారు.. ఇప్పుడు కాంగ్రెస్ వంతు: కేటీఆర్



హైదరాబాద్, నేటిధాత్రి:
రేవంత్‌రెడ్డి ఏ పార్టీలో అడుగుపెడితే ఆ పార్టీ నాశనమవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

తెలంగాణలో తెలుగుదేశం పార్టీని రేవంత్‌రెడ్డి దెబ్బతీశారని, ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి కూడా అలాగే మారుతుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. నేతన్న బీమా, బతుకమ్మ చీరలు, సాగునీటి పథకాలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు.

**అఫిడవిట్‌లో ఉన్నదే చెబుతున్నారు**

తన వ్యాపారాలపై రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు కొత్తవేమీ కావని కేటీఆర్ అన్నారు. 2009లో తాను సమర్పించిన అఫిడవిట్‌లోనే హోటల్ వ్యాపారం వివరాలు ఉన్నాయని తెలిపారు. వ్యాపారం చేసుకోవడం తప్పేమీ కాదని, కుటుంబ పోషణ కోసం తాను వ్యాపారం చేస్తున్నానని చెప్పారు. తన హోటళ్లకు రేవంత్‌రెడ్డి ఉచిత ప్రచారం కల్పిస్తున్నారని వ్యాఖ్యానించారు.
రేవంత్‌రెడ్డి భారీ బందోబస్తుతో పర్యటించడాన్ని కూడా కేటీఆర్ ప్రశ్నించారు. తనను తాను 'నల్లమల పులి'గా చెప్పుకోవడం సరికాదంటూ విమర్శలు చేశారు.

## బీసీలకు అండగా నిలిచింది..

# నిలిచేది మేమే!

- 34 శాతం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో అప్పీల్
- రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కోర్టుల్లో పిటిషన్లు.. సీఎం చంద్రబాబు
- సంక్షేమం–అభివృద్ధితో జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం
- డ్వాక్రా రుణంతో వ్యాపారం.. వాట్సాప్‌తో విస్తరణ



రేపల్లె, నేటిధాత్రి:
బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచింది.. నిలిచేది తమ ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. బీసీలకు చేయూతనిచ్చే విషయంలో ఎక్కడా రాజీపడబోమని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లనున్నట్లు తెలిపారు. బాపట్ల జిల్లా రేపల్లెలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. పల్లె ప్రజావేదిక సభలో మాట్లాడారు.

**34 శాతం రిజర్వేషన్ల కోసం అప్పీల్..**

నాడు ఎన్టీఆర్ బీసీలకు రాజకీయంగా గుర్తింపు తీసుకొచ్చారని, తాను వారికి అండగా నిలబడి ప్రోత్సహించానని చంద్రబాబు అన్నారు. 1995లో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చామని తెలిపారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని, దీంతో 16,800 మంది పదవీ అవకాశాలు కోల్పోయారని పేర్కొన్నారు.
తాము మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ప్రతిపక్ష పార్టీ కోర్టును ఆశ్రయించిందని సీఎం అన్నారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదని కోర్టులో వాదించారని, హైకోర్టు తమ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను కొట్టివేసిందని తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లనున్నట్లు వెల్లడించారు.
బీసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వారు.. తాము మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇస్తే ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. నియామక ప్రక్రియను అడ్డుకునేందుకు కోర్టుల్లో వందలాది కేసులు వేశారని అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు రాకుండా అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

**జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం**

గడచిన 28 నెలలుగా ప్రతి నెలా మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటున్నానని చంద్రబాబు తెలిపారు. ముఖ్యమంత్రి అంటే సామాన్యుడి మనిషి అని తాను విశ్వసిస్తానన్నారు. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నామని చెప్పారు. పేదలకు న్యాయం చేయాలన్న బాధ్యతతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.
ప్రతి నెలా నాలుగుసార్లు ప్రజల ముందుకు వస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన పేదలకు ఆర్థిక భద్రత కల్పించే పెన్షన్ల కార్యక్రమం, 9వ తేదీన భూ సమస్యల పరిష్కార కార్యక్రమంలో పాల్గొంటున్నామని చెప్పారు. గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తున్నామన్నారు. మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో, నాలుగో శనివారం సంజీవని కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు వివరించారు.



ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని నిత్యం ప్రజా సేవకులుగా పనిచేస్తున్నామని సీఎం అన్నారు. గడచిన రెండేళ్లుగా ప్రతి వ్యక్తికి, ప్రతి కుటుంబానికి సాధికారత కల్పిస్తున్నామని, రాష్ట్రంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గత పాలకులు వ్యవస్థలను భ్రష్టుపట్టించి రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ సంక్షేమాన్ని అందిస్తున్నామని తెలిపారు. పెన్షన్ల కోసం ఇప్పటివరకు రూ.76 వేల కోట్లు ఖర్చు చేశామని చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్ర సహకారంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం బుల్లెట్ వేగంతో సుపరిపాలన అందిస్తోందన్నారు. పేదరికాన్ని కేవలం ఆర్థిక కోణంలో కాకుండా మానవీయ కోణంలో చూస్తూ జీవన ప్రమాణాలు పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సంక్షేమంతో పాటు పీ4 కార్యక్రమం ద్వారా అట్టడుగున ఉన్న వారికి చేయూతనిస్తున్నామని తెలిపారు.

**డ్వాక్రా రుణంతో వ్యాపారం..**

రేపల్లెలోని నాలుగో వార్డులో శ్రీలక్ష్మి కిరాణా జనరల్ స్టోర్‌ను చంద్రబాబు సందర్శించారు. దుకాణం నిర్వాహకులు జి. జేజమ్మ, జి. శ్రీనివాసరావుతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల ద్వారా అందుతున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు.
జి. శ్రీనివాసరావు, జేజమ్మ దంపతులు డ్వాక్రా రుణంతో కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్న వివరాలను సీఎంకు తెలిపారు. 2003 నుంచి పెయింటర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు.. 2025 ఫిబ్రవరిలో రూ.లక్ష పెట్టుబడితో చిన్న దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. అదే ఏడాది జూన్‌లో రూ.2 లక్షల గ్రూప్ లింకేజీ రుణం రావడంతో వ్యాపారాన్ని విస్తరించినట్లు వివరించారు.

**వాట్సాప్‌తో ఇంటికే సరుకులు..**

సాంకేతికతను వినియోగించుకుంటూ వ్యాపారం నిర్వహిస్తున్నామని జేజమ్మ తెలిపారు. స్మార్ట్‌ఫోన్, వాట్సాప్ ద్వారా వినియోగదారుల నుంచి ఆర్డర్లు తీసుకుంటున్నామని చెప్పారు. నెలవారీ కిరాణా సరుకుల జాబితాను వినియోగదారులు వాట్సాప్‌లో పంపితే.. ఆ సరుకులను తన భర్త ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 'వన్ ఫ్యామిలీ––వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమం తనకు స్ఫూర్తినిచ్చిందని జేజమ్మ సీఎంతో పంచుకున్నారు. మహిళలు వివిధ రంగాల్లో వ్యాపార అవకాశాలను అన్వేషించి స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని చంద్రబాబు సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వ్యాపార నిర్వహణ, వాట్సాప్ బిజినెస్‌పై ఉన్న అవగాహనను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం శ్రీనివాసరావు తండ్రి వెంకటరావుకు సీఎం చంద్రబాబు వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి ఫొటో దిగారు.

## రైతులకు కరెంట్ కటకట..

# రాజస్థాన్‌కు విద్యుత్ ఎందుకు?

- సింగరేణి 800 మెగావాట్లు అక్కడికి పంపుతారా?
- రైతులకు 20 గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వాలి: హరీశ్‌రావు



సిద్దిపేట, నేటిధాత్రి:
రాష్ట్రంలో రైతులకు సరిపడా విద్యుత్ అందడం లేదని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. నంగునూరు మండలంలోని పాలమాకుల, అక్కనేపల్లి, అంక్షాపూర్ గ్రామాల్లో పర్యటించిన ఆయన.. అనంతరం నర్మెట సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. రైతులకు రోజుకు 7––8 గంటలకు మించి కరెంట్ రావడం లేదని, లో–వోల్టేజీతో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని హరీశ్‌రావు అన్నారు. పాలమాకులలో మూడు రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేదని, నంగునూరు మండలంలో ఈ వారంలో 41 ట్రాన్స్‌ఫార్మర్లు, 100––200 మోటార్లు కాలిపోయాయని తెలిపారు. ఒక్క మోటారు మరమ్మతుకే రైతుపై సుమారు రూ.10 వేల భారం పడుతోందన్నారు.

**2 లక్షల కనెక్షన్లు పెండింగ్**

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నాయని హరీశ్‌రావు ఆరోపించారు. ట్రాన్స్‌ఫార్మర్లకు రోలింగ్ స్టాక్ ఏర్పాటు చేసి, కాలిపోయిన వెంటనే కొత్తవి అమర్చాలని డిమాండ్ చేశారు.

**రాజస్థాన్‌కు 800 మెగావాట్లపై ప్రశ్నలు**

సింగరేణి––రాజస్థాన్ ప్రతిపాదిత భాగస్వామ్యంలో 800 మెగావాట్ల విద్యుత్ రాజస్థాన్‌కు కేటాయించే అంశాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణలో రైతులు విద్యుత్ కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో రాష్ట్రంలో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఇతర రాష్ట్రానికి ఎందుకు కేటాయిస్తున్నారని నిలదీశారు. ఈ ఒప్పందాన్ని రద్దు చేసి విద్యుత్‌ను తెలంగాణ అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు.
రైతులకు కనీసం 20 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వడంతో పాటు పెండింగ్ కనెక్షన్లు విడుదల చేయాలని, అన్ని జిల్లాల విద్యుత్ నిల్వ కేంద్రాల్లో అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచాలని హరీశ్‌రావు కోరారు.

# బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదు

### ఎవరూ కోరుకోవడం లేదు..
### ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో బీఆర్ఎస్‌తో ఎలాంటి పొత్తు ఉండదని కేంద్ర మంత్రి, బీజేపీ నేత కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికలు ఏవైనా బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని తెలిపారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. "బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందని ఎవరు అన్నారు? పొత్తును ఎవరూ కోరుకోవడం లేదు. మొదట కేటీఆర్ తన చెల్లెలు కవితను కలవమనండి.. ఆ తర్వాత వేరే పొత్తుల గురించి ఆలోచించొచ్చు" అని వ్యాఖ్యానించారు.

# మద్దతు ధరకు పంటలన్నీ కొనాలి



### కేంద్రానికి మంత్రి తుమ్మల సూచన

హైదరాబాద్, నేటిధాత్రి:
మద్దతు ధర ప్రకటించిన పంటలన్నింటినీ కేంద్రం 100 శాతం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. మద్దతు ధర ప్రకటించడం మాత్రమే కాకుండా.. ప్రతి రైతుకు ఆ ధర అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను గుర్తించి రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. వర్షపాతం, నేల తేమ, సాగు విస్తీర్ణం, భూగర్భజలాలు, రిజర్వాయర్ నిల్వలు, పశుగ్రాసం, తాగునీరు తదితర అంశాల ఆధారంగా కరువు పరిస్థితులను అంచనా వేయాలని సూచించారు. కుసుమ, రేప్‌సీడ్––ఆవాలు, మసూర్, బార్లీ, శనగ, గోధుమలకు కేంద్రం పెంచిన మద్దతు ధరలు రైతులకు పూర్తిగా అందేలా చూడాలని కోరారు.

## హైదరాబాద్ పోలీస్ పరిధుల్లో

# భారీ పునర్వ్యవస్థీకరణ

### జోన్లు, డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల సరిహద్దుల్లో మార్పులు.. 76 ప్రాంతాల పరిధులు పునర్విభజన



హైదరాబాద్, నేటిధాత్రి:
హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం భారీ పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. పోలీస్ జోన్లు, డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల పరిధులను పునర్విభజిస్తూ 76 ప్రాంతాలకు సంబంధించి మార్పులు చేసింది. పరిపాలనా సౌలభ్యం, సమర్థవంతమైన పోలీసింగ్ లక్ష్యంగా పలు ప్రాంతాలను ఇతర జోన్లు, డివిజన్ల పరిధిలోకి మార్చింది.
మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలను మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోకి తీసుకొచ్చారు. శంషాబాద్ డివిజన్‌లోనూ మార్పులు చేసి.. ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పేరును శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌గా మార్చారు. మహేశ్వరం, శంషాబాద్, రాజేంద్రనగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్‌నగర్ ప్రాంతాల పరిధుల్లోనూ మార్పులు చేశారు.
ట్రాఫిక్ పోలీస్, మహిళా భద్రత విభాగం, జోనల్ సైబర్ సెల్ పరిధులను కూడా పునర్వ్యవస్థీకరించారు. ఈ మేరకు ప్రభుత్వం జీఓఎంఎస్ నం.84 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది.

## పంచాయతీ బిల్లుల చెల్లింపులకు

# అడ్డంకులు తొలగింపు

### ఉప సర్పంచ్ సంతకంలో జాప్యంపై చర్యలు..
### ప్రత్యామ్నాయంగా అధికారులకు చెక్ పవర్



హైదరాబాద్, నేటిధాత్రి:
గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులు సజావుగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. చెక్కులపై సంతకం చేయాల్సిన ఉప సర్పంచ్ ఎలాంటి కారణం లేకుండా ఏడు రోజులకు మించి జాప్యం చేస్తే జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. విచారణలో ఉద్దేశపూర్వకంగా సంతకం చేయకుండా జాప్యం చేసినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. సంతకాల వివాదాలతో బిల్లుల చెల్లింపులు నిలిచిపోకుండా అవసరమైన సందర్భాల్లో ఉప సర్పంచ్ స్థానంలో పంచాయతీ కార్యదర్శి, ఎంపీవో లేదా ఎంపీడీవోలో ఒకరికి సంయుక్త చెక్ పవర్ ఇచ్చేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# జిల్లాల్లో దశలవారీగా వృద్ధాశ్రమాలు

### 30 డే కేర్ కేంద్రాల్లో ఉచిత సేవలు.. 15.60 లక్షల మందికి చేయూత పింఛన్



హైదరాబాద్, నేటిధాత్రి:
వృద్ధుల గౌరవం, భద్రత, ఆరోగ్యం, ఆర్థిక భరోసాకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ప్రతి జిల్లాలో వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారిని నియమించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.
అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 30 డే కేర్ కేంద్రాల్లో వృద్ధులకు ఉచిత పౌష్టికాహారం, వైద్య సేవలు, ఆటలు, వినోద కార్యక్రమాలు అందిస్తున్నట్లు తెలిపారు. 33 జిల్లాల్లో దశలవారీగా వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రస్తుతం 10 వృద్ధాశ్రమాలు నిర్వహణలో ఉన్నాయని చెప్పారు.
అర్హులైన 15.60 లక్షల మంది వృద్ధులకు నెలకు రూ.2,016 చొప్పున చేయూత పింఛన్ అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వృద్ధుల అత్యవసర సహాయం కోసం 14567 ఎల్డర్ లైన్ అందుబాటులో ఉందన్నారు. నిర్వహణ ట్రిబ్యునళ్లలో కేసుల దాఖలు ప్రక్రియను సులభతరం చేశామని, వృద్ధుల సంరక్షణ కోసం 1,700 మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

## జపాన్‌లో ఆసియా క్రీడలను వీక్షించిన తెలంగాణ బృందం

జపాన్, నేటిధాత్రి: ఐచి–నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలను తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం వీక్షించింది. క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో ప్రభుత్వ ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేనారెడ్డి, వీసీ–ఎండీ సోనీ బాలాదేవి పర్యటించారు. అంతర్జాతీయ క్రీడల నిర్వహణ, ప్రపంచస్థాయి వసతులు, క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. తెలంగాణలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని ప్రతినిధులు తెలిపారు.




"నేటిధాత్రి" 22వ వసంతపు తోరణం
చరిత్రను చెప్పాలన్నా, ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"
"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్లు" దాటుకొని ముందుకు సాగుతూ, తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని, తడి ఆరని అక్షరాలను మోసుకుంటూ
పత్రికా ప్రయాణం సాగిస్తూ "22 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.
"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన, అందిస్తున్న సహాయ, సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....
22ND ANNIVERSARY
వసంతాల అక్షరోద్యమం 2004-2026
మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



22th ANNIVERSARY 2004-2025
వసంతాల అక్షరోద్యమం
మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

# వార్తలు వస్తున్నా..అధికారుల్లో చలనం ఏదీ

**▶▶మొగుళ్లపల్లి రోడ్డుపై గుంతలపై స్పందనేది?**


గుంతలతో ప్రయాణం నరకప్రాయం

**పరకాల, నేటిధాత్రి:** నాగారం,లక్ష్మీపురం గ్రామాల మీదుగా వెళ్లే మొగుళ్లపల్లి రహదారిపై ఏర్పడిన గుంతల సమస్యపై వార్తలు ప్రచురితమవుతున్నా సంబంధిత శాఖ అధికారుల్లో మాత్రం చలనం కనిపించకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.రహదారి పరిస్థితిని వెలుగులోకి తీసుకువస్తున్నా గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది.ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రహదారిపై గుంతలు వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు స్పందన లేకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**▶▶గుంతలు పూడ్చేదెప్పుడు?** రహదారిపై ఏర్పడిన గుంతలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.రహదారిపై గుంతల కారణంగా వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.వరుసగా వార్తలు వస్తున్నా స్పందన లేకపోవడంపై ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# జిల్లా స్థాయి నృత్య పోటీల్లో సాయిమనుజ్ఞ ప్రథమ స్థానం.




**బెల్లంపల్లి, నేటిధాత్రి:** మంచిర్యాల లో నిన్న నిర్వహించిన జిల్లా స్థాయి నృత్య పోటీలలో పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ , కాసిపేట పాఠశాల విద్యార్థిని సాయిమనుజ్ఞ ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిభను చాటుకుంది. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా సబ్ కలెక్టర్ విజేత సాయిమనుజ్ఞకు మెమోంటో మరియు సర్టిఫికెట్ అందజేసి అభినందించారు.సాయిమనుజ్ఞ సాధించిన విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ కలీల్ ,ఉపాధ్యాయులు, డ్యాన్స్ టీచర్ పి . అర్చన జయప్రకాష్, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. విద్యార్థిని నృత్యరంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# జీవోలు చూపించి రాజకీయం చేయడం కాదు.. చేతల్లో అభివృద్ధి చూపించాలి: రావెళ్ల

**▶▶ఉత్తమ్, పద్మావతి రెడ్డి ల ఆశయం.. ప్రజలకు కార్పొరేట్ వైద్యం: రావెళ్ల కృష్ణారావు...**



**కోదాడ, నేటిధాత్రి:** ప్రభుత్వాసుపత్రి వేదికగా మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం జీవోలను చూపిస్తూ రాజకీయం చేయడం సరి కాదని ఆయన హితవు పలికారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల ఆధ్వర్యంలో కోదాడ నియోజకవర్గ పరిసర ప్రాంతాల బడుగు, బలహీన ప్రజలకు భారం కాకుండా కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడం, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల జీవిత ఆశయమని కాంగ్రెస్ నాయకుడు రావెళ్ల కృష్ణారావు స్పష్టం చేశారు.

# మాడిపల్లిలో ఘనంగా సహభాగిత గ్రామీణ మదింపు (PRA)



**▶▶రైతులు--విద్యార్థుల భాగస్వామ్యంతో గ్రామ వనరులు, సమస్యలపై అధ్యయనం....**

**హసన్‌పర్తి, నేటిధాత్రి:** మాడిపల్లి గ్రామంలో SR యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్ (RAWEP)లో భాగంగా సహభాగిత గ్రామీణ మదింపు (Participatory Rural Appraisal--PRA) కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డా. జి. భూపాల్ రాజ్, ADO శ్రీ బి. ఆది రెడ్డి, AO శ్రీమతి అనురాధ, AEO శ్రీ సుమన్, గ్రామ సమన్వయకర్త డా. జి. భార్గవి, RAWEP కోఆర్డినేటర్ శ్రీ టి. సాయి కృష్ణ, ఇతర అధ్యాపకులు, RAWEP విద్యార్థులు, రైతులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామస్థులతో కలిసి సామాజిక మ్యాప్, వనరుల మ్యాప్, పంటల శాతం, నేలల రకాలు, గ్రామ చరిత్ర టైమ్‌లైన్, సమస్యల వృక్షం (Problem Tree), మొబిలిటీ మ్యాప్, Venn Diagram, సీజనల్ క్యాలెండర్ తదితరాలను రూపొందించి ప్రదర్శించారు. విద్యార్థుల కృషి, చక్కటి ప్రదర్శన, రైతులతో కలిసి కొత్త విషయాలను నేర్చుకుంటున్న విధానాన్ని ADO శ్రీ బి. ఆది రెడ్డి, AO శ్రీమతి అనురాధ అభినందించారు. వ్యవసాయ మరియు ప్రభుత్వ కార్యక్రమాల్లో విద్యార్థులు--రైతుల భాగస్వామ్యం ఎంతో అవసరమని AO పేర్కొన్నారు. డీన్ డా. జి. భూపాల్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు గ్రామీణ వ్యవసాయ పరిస్థితులను ప్రత్యక్షంగా అర్థం చేసుకునేందుకు RAWEP, PRA కార్యక్రమాలు అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులు మరియు విద్యార్థులు తమ అభిప్రాయాలను, అనుభవాలను పంచుకున్నారు. PRA ద్వారా గ్రామంలోని వనరులు, సమస్యలు, వ్యవసాయ పరిస్థితులను సమగ్రంగా తెలుసుకునే అవకాశం కలిగిందని రైతులు తెలిపారు. గ్రామ సమన్వయకర్త డా. జి. భార్గవి కార్యక్రమానికి హాజరైన అధికారులు, అధ్యాపకులు, రైతులు, గ్రామస్థులు మరియు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఈనెల 2న మటన్ చికెన్ దుకాణాలు మూసివేయాలి

**▶▶అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా చికెన్, మటన్ దుకాణాలు మూసివేత...**

**▶▶నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా షాపులు తీస్తే కఠిన చర్యలు...**

**▶▶మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్....**



**భూపాలపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని చికెన్, మటన్ ఇతర మాంసం విక్రయ దుకాణాలు గాంధీ జయంతిని పురస్కరించుకొని ఈనెల 2న (శుక్రవారం) రోజున పూర్తిగా మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి చికెన్, మటన్ లేదా ఇతర మాంసం విక్రయాలు, కోతలు, జంతువుల వధ మాంసం విక్రయానికి సంబంధించిన కార్యకలాపాలు నిర్వహించరాదని సూచించారు. మాంసం దుకాణాల యజమానులు ఈ సూచనలను తప్పనిసరిగా పాటించి మున్సిపాలిటీ అధికారులకు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తెలంగాణ మున్సిపాలిటీల చట్టం, 2019 అమలులో ఉన్న సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోబడతాయని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. ప్రజలు, మాంసం దుకాణాల యజమానులు ఈ విషయాన్ని గమనించి 02-10-2026న మాంసం దుకాణాలను పూర్తిగా మూసివేసి గాంధీ జయంతి సందర్భంగా మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అంద జేత



**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండలం ప్రగతి సింగారం గ్రామంలోని నిరుపేద కుటుంబం దుప్పటి సమ్మక్క నిన్న రాత్రి మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయ కులు బోనెపల్లి రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు బోనపల్లి రఘుపతిరెడ్డి 5000 మరియు ప్రగతి సింగారం సర్పంచ్ వార్డ్ మెంబర్లు 6000 మొత్తము 11 వేల రూపాయలు దుప్పటి సమ్మక్క కుమా రుడైన దుప్పటి సురేష్ అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాదారపు సరోజన, ఉప సర్పంచ్ లక్ష్మారెడ్డి,వార్డు సభ్యులు పాల్గొన్నారు

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ




**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన 39 మంది లబ్ధిదారులకు 39,04,524 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను




అప్పుల పాలు చేసినప్పటికీ, ప్రజా ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నా రు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఎల్ఓసీ లను పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామని అన్నారు.
ప్రజా ప్రభుత్వం , రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి,అధికారులు, పరకాల మార్కెట్ వైస్ చైర్మన్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయ కులు,సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన పలువురుకాంగ్రెస్ నాయకులు.



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల మండలం, వెంచరామి గ్రామ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. స్థానిక సర్పంచ్ శ్రీమతి కాసురమా కుమార్ నాయకత్వంలో, మండల నాయకత్వం మరియు స్థానిక నాయకుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, అయన మాట్లాడుతూ.కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో రైతులు, ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలయ్యాయని, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని పలువురు తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు.ప్రజల్లో కేసీఆర్ పాలనలో రైతులు,ప్రజలకు అందిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారన్నారు.ప్రజలు కోరుకున్న సంక్షేమం, రైతులు కోరుతున్న మద్దతు, ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు.వెంచరామి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, వారి రాకతో చిట్యాల మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందనిబీఆర్ఎస్‌లో చేరిన ప్రతి ఒక్కరినీ సాదరంగా స్వాగతిస్తున్నామని, పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ లో చేరినవారు జక్కె వెంకటేశం, మోరే ధర్మరాజు, కళ్లేపల్లి సదయ్య,చేటుకూరి అశోక్, గుర్రం అయిలయ్య, యూత్ ఉపాధ్యక్షుడు తిప్పన శివ, ఆశాడపు మల్లయ్య, పరికిపండ్ల సమ్మయ్య, పరికిపండ్ల సాగర్, పరికిపండ్ల సంతోష్ పలువురు చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గొర్రె సాగర్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి అసెంబ్లీ నివాళి

**▶▶కుటుంబ సభ్యులకు శ్రద్ధాంజలి తీర్మాన ప్రతి అందజేత...**






**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట మాజీ శాసనసభ్యులు దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డికి తెలంగాణ శాసనసభ ఘనంగా నివాళులర్పించింది. ఆయన మృతి పట్ల శాసనసభలో ప్రవేశపెట్టిన సంతాప తీర్మాన ప్రతిని నల్లబెల్లి తహసీల్దార్ బుధవారం పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డికి అందజేశారు. రాష్ట్ర ప్రజలకు, నియోజకవర్గానికి సుదర్శన్ రెడ్డి అందించిన నిరుపమాన సేవలను స్మరించుకుంటూ గత సెప్టెంబరు 8 న తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా సంతాప తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంతకం చేసిన ఈ అధికారిక శ్రద్ధాంజలి తీర్మాన ప్రతిని అధికారులు నర్సంపేటలోని ఆయన నివాసంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ ప్రవేశపెట్టిన తీర్మానంలో --- "నర్సంపేట మాజీ ఎమ్మెల్యే శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, సభ ఏకగ్రీవంగా శ్రద్ధాంజలి ఘటిస్తోంది అని పేర్కొన్నారు. తీర్మాన ఆమోదం అనంతరం అసెంబ్లీలో సభ్యులందరూ కొద్దిసేపు మౌనం పాటించి దివంగత నేతకు నివాళులర్పించారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**నడికూడ,నేటిధాత్రి:** డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నడికూడ మండల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను సన్మానించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి కె. హనుమంతరావు అధ్యక్షత వహించగా,మండల అభివృద్ధి అధికారి ఆర్ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నడికూడ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన 16 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి,ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె.హనుమంతరావు, ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు మరింత బాధ్యత,అంకితభావం, వృత్తి నిబద్ధతతో పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత పెంచి,నడికూడ మండలాన్ని జిల్లాలో విద్యాపరంగా ఆదర్శ మండలంగా నిలిపేందుకు ప్రతి ఉపాధ్యాయుడు సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. సన్మానం అందుకున్న మండల ఉత్తమ ఉపాధ్యాయులు ఎన్. వేణు గోపాల స్వామి -- కాంప్లెక్స్ హెచ్ఎం సి. హెచ్. జ్ఞాన ప్రసునాంబ -- జీహెచ్ఎం గ్రేడ్-II ఆర్. ప్రణీత -- ఎస్ఏ (గణితం),ఎఫ్ఏసీ హెచ్ఎం కె. శ్రీనివాస్ -- ఎస్ఏ (బయో. సైన్స్) డి.తిరుపతి -- ఎస్ఏ (సోషల్) పి. శ్రీనివాస్ -- ఎస్ఏ (తెలుగు) ఆర్. సుమలత -- ఎస్ఏ (తెలుగు) సి. హెచ్. ప్రేమానందం -- ఫిజికల్ డైరెక్టర్ ఆర్. శివకుమార్ -- ఫిజికల్ డైరెక్టర్ జె. కుమార స్వామి -- హెచ్ఎం ఎస్.డి. నన్నె సాహెబ్ --హెచ్ఎం సి. హెచ్. నరసింహ రెడ్డి -- హెచ్ఎం వి. మనోహర్ -- ఎస్‌జీటీ ఎల్. దేవ -- ఎస్‌జీటీ సి. హెచ్. జితేందర్ రావు -- ఎస్‌జీటీ పి.అశోక్ -- ఎంఐఎస్ కో-ఆర్డినేటర్,ఎంఆర్‌సీ నడికూడ ఈ కార్యక్రమంలో టి పి టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి, మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రధాన బాధ్యులు మోడెం రాజేందర్ బాబు,రావుల రమేష్,శ్రావణ,బిక్షపతి, రవీందర్,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,సిఆర్ పిలు రఘుపతి,కవిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

**▶▶ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం**

**▶▶యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ**



**మంగపేట, నేటిధాత్రి:** మంగపేట మండలంలోని అర్హులైన పట్టభద్రులందరూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ ఒక ప్రకటనలో కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని,ప్రతి అర్హత కలిగిన పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ముందుగానే ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

**పట్టభద్రుల ఓటు నమోదుకు ముఖ్యమైన వివరాలు:**

**▶▶భారతదేశంలోని గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం/విద్యాసంస్థ నుంచి డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.**

**▶▶సంబంధిత పట్టభద్రుల నియోజకవర్గంలో సాధారణ నివాసి అయి ఉండాలి.**

**▶▶ఓటరు నమోదు ప్రారంభ తేదీ: సెప్టెంబర్ 28, 2026**

**▶▶దరఖాస్తుకు చివరి తేదీ:నవంబర్ 6, 2026**

**▶▶దరఖాస్తు ఫారం : ఫారం-18**

**అర్హత....** నవంబర్ 1, 2026 నాటికి కనీసం మూడు సంవత్సరాల ముందే డిగ్రీ లేదా ఎన్నికల నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన తత్సమాన విద్యార్హతను పూర్తి చేసి ఉండాలి.

**ముఖ్య గమనిక...** గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేరు ఉన్నప్పటికీ,కొత్తగా రూపొందించే ఓటరు జాబితా కోసం ప్రతి అర్హుడు ఫారం 18 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి.గత జాబితాలో పేరు ఉన్నదనే కారణంతో కొత్త జాబితాలో పేరు స్వయంచాలకంగా కొనసాగుతుందని భావించకూడదు.అందువల్ల మంగపేట మండలంలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నవంబర్ 6వ తేదీలోపు ఫారం 18 ద్వారా ఎమ్మెల్సీ ఓటును నమోదు, చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు.

# ఈనెల 3 తర్వాత లాభాల వాటా, దీపావళి బోనస్ పై ప్రకటన

**▶▶సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు వాసిరెడ్డి సీతారామయ్య కొరిమి రాజ్ కుమార్....**

**▶▶కార్మిక హక్కులపై పోరాడేది ఎర్రజెండా సంఘం ఏఐటీయూసీ...**

**▶▶స్వలాభం కోసం పనిచేసే సంఘాలను నమ్మొద్దు...**




**భూపాలపల్లి, నేటిధాత్రి:** సింగరేణిలో 22 మెరుగైన అగ్రిమెంట్లను సాధించిన ఘనత ఏఐటీయూసీ గుర్తింపు సంఘం దేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కొమురయ్య భవన్ లో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన జనరల్ బాడీ సమావేశంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. గత తొమ్మిది సంవత్సరాలుగా టీబీజీకేఎస్ సంఘం చేయని అనేక కార్మిక సమస్యలను పెండింగ్లో ఉంచిందని, 22 అగ్రిమెంట్లను సాధించిన ఘనత ఏఐటీయూసీదేనని వారు వివరించారు. అందులో ముఖ్యంగా మెడికల్ బోర్డు, పెరిక్స్ పై ఇన్కమ్ టాక్స్ రద్దు, కార్మికుల సొంతింటి కల, మారుపేరు సమస్యలు ఇట్లా 22 అగ్రిమెంట్లపై యాజమాన్యంతో మాట్లాడి అమలయ్యే దిశగా ఏఐటీయూసీ పోరాడిందన్నారు. స్వలాభం కోసం పనిచేసే సంఘాలను నమ్మరాదని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం గా ఉండి చేసింది ఏమీ లేదని ఇతర సంఘాలు దుష్ప్రచారం చేస్తున్నాయని వాటిని కార్మికులంతా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సింగరేణిలో కొత్త బావులు రాకుంటే సింగరేణి మనుగడ లేదని సింగరేణికి నూతన గనులను కేటాయించే విధంగా ప్రభుత్వం యాజమాన్యాన్ని ఒప్పించడం జరిగిందని అందులో భాగంగానే తాడిచెర్ల ఓసి 2 గని సింగరేణి కేటాయించడం జరిగిందని అన్నారు. ఇంకా భూపాలపల్లి ప్రాంతంలో పివిఎన్ఆర్ ఓసి రాబోతుందని, పది సంవత్సరాలు టీబీజీకేఎస్ లో ఒక్క నూతన గని రావడం కోసం ప్రయత్నం చేశారా అని సూటిగా ప్రశ్నించారు. అలాంటివారు ఏఐటీయూసీ మీద దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. సింగరేణిలో ఈరోజు అనుభవిస్తున్న లాభాల బాట దీపావళి బోనస్ లాంటి అనేక హక్కుల సాధించి పెట్టింది ఎర్రజెండా సంఘమేనని గుర్తు చేశారు. ఈ సంవత్సరం లాభాల వాటా, దీపావళి బోనస్ ఈనెల 3న జరిగే ఆర్ ఎల్ సి సమావేశంలో చర్చించిన తర్వాత ప్రకటన చేస్తారని తెలిపారు. కార్మికులు లాభాల వాటా, దీపావళి బోనస్ పై ఎలాంటి అపోహలు నమ్మరాదని, త్వరలోనే కార్మికులకు ఈ రెండు లాభాలను అందించే విధంగా గుర్తింపు సంఘంగా యాజమాన్యాన్ని ప్రభుత్వమును ఒత్తిడి చేయడం కోరడం జరిగిందన్నారు. గత టీబీజీకేఎస్ లో మెడికల్ బోర్డులో అవినీతి జరిగిందని, అందుకోసమే కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ బోర్డును నిలిపివేయడం జరిగిందని, మళ్లీ దాన్ని నెలకు ఒకసారి మెడికల్ బోర్డు నిర్వహించే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. కోలిండియాలో మాదిరిగానే పెరిక్స్ పై ఇన్కమ్ టాక్స్ చెల్లించే విధంగా చేయాలని కోరడం జరిగిందన్నారు. కార్మికుల సొంతింటి పథకంపై కమిటీ వేయడం జరిగిందని త్వరలోనే అమలు అవుతుందన్నారు మారుపేరు సమస్యలు డిస్మిస్ కార్మికులు సమస్యలు అట్లాగే మైనింగ్ స్టాఫ్ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా ఏఐటియుసి పోరాడుతుందని, కార్మిక హక్కుల కోసం నిత్యం కార్మికుల పక్షాన పోరాడేది ఏ ఐ టి సి గుర్తింపు సంఘమేనని, మళ్లీ గుర్తింపు సంఘం ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కార్మికుల అప్రమత్తంగా ఉండి స్వలాభం కోసం పనిచేసే సంఘాలను వారి కుట్రలను తిప్పి కొట్టి ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలవడం కోసం కార్మికులంతా కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామ్ చందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు జి సుధాకర్ రెడ్డి, జి శ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ తోట రామచందర్, టెక్నీషియన్ ఇన్చార్జి రవికుమార్, కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్ నూకల చంద్రమౌళి, బ్రాంచ్ నాయకులు పోశం, రాజయ్య, గోవిందుల తిరుపతి, సత్యనారాయణ రెడ్డి, జగత్ రావు, ఫిట్ సెక్రటరీలు సదయ్య, రాజేందర్, పి శ్రీనివాస్, ఎల్ శంకర్, ఎండి కరీముల్లా, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, సాంబయ్య, సుమారు 500 మంది కార్మికులు పాల్గొన్నారు.

# సింగరేణి గిరిజన ఉద్యోగుల సమస్యలపై సమీక్ష

**సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి....**

**రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కు గిరిజన ఉద్యోగుల సంఘం వినతి...**



**హైదరాబాద్, నేటిధాత్రి:** సింగరేణిలో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌తో బుధవారం సింగరేణి భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మయ్య,ప్రవీణ్, రాంబాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధరావత్ పంతులు,రాష్ట్ర జనరల్ సెక్రటరీ భూక్య నాగేశ్వరరావు సంఘం తరపున ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు,డిమాండ్లను కమిషన్ చైర్మన్,సభ్యులు, సింగరేణి యాజమాన్య ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు.

**ప్రధాన డిమాండ్లు...** ప్రతి మూడు నెలలకు ఒకసారి గిరిజన ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించాలని కోరారు. 1/70 చట్టం,ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న గిరిజన ఉద్యోగులకు ఇళ్ల నిర్మాణం కోసం రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణ సదుపాయం కల్పించాలని లేదా ఆ రుణానికి సంబంధించిన వడ్డీని సింగరేణి యాజమాన్యం భరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సింగరేణి అధికారిక కార్యక్రమాల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని, సింగరేణి హెడ్‌ఆఫీస్ ప్రాంగణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.దేశీయ, విదేశీ శిక్షణ కార్యక్రమాల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.సింగరేణిలో వివిధ కేటగిరీల్లో పెండింగ్‌లో ఉన్న ఎన్‌సీడబ్ల్యూఏ క్యారీ ఫార్వర్డ్,బ్యాక్‌లాగ్ పోస్టులను ఒకేసారి ప్రత్యేక చర్య ద్వారా భర్తీ చేయాలని కోరారు. అకౌంట్ ఆఫీసర్ పోస్టుకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎం.కాం పూర్తి చేసిన వెంటనే పరీక్ష రాసే అవకాశం కల్పించాలని, ప్రస్తుతం ఉన్న ఐదేళ్ల పోస్టు అర్హత అనుభవం, 50 శాతం మార్కుల నిబంధనలను సడలించాలని కోరారు.క్లస్టర్, ఇంటర్ క్లస్టర్ ప్రమోషన్లలో రోస్టర్ రిజిస్టర్ ఏర్పాటు చేసి అమలు చేయాలని,క్యారీ ఫార్వర్డ్ పోస్టుల ప్రమోషన్లలో మూడేళ్ల సర్వీస్ నిబంధనను సడలించి రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసిన అర్హులకు అవకాశం కల్పించాలని కోరారు.కోయగూడెం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును గిరిజన ప్రాంత పరిధిలో ఉన్నందున సింగరేణి యాజమాన్యం లేదా గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ద్వారా నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.సర్వే ఏ-గ్రేడ్,సర్ఫేస్ విభాగాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు అర్హులైన ఉద్యోగులతో యాక్టింగ్ ప్యానెల్ ఏర్పాటు చేయాలని కోరారు.ఇప్పటికే 665 బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసిన నేపథ్యంలో మిగిలిన బ్యాక్‌లాగ్ పోస్టులను కూడా ప్రత్యేక చర్య కింద భర్తీ చేయాలని కోరారు.క్లారికల్ పోస్టుల నియామక ప్రక్రియలో కోర్టు కేసుల కారణంగా ఏర్పడిన జాప్యాన్ని తొలగించి పరీక్ష నిర్వహించి అర్హులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ)లో ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.అలాగే పెండింగ్‌లో ఉన్న ఎలక్ట్రీషియన్,ఫిట్టర్స్ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన సింగరేణి యాజమాన్యానికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

**అంబేద్కర్ విగ్రహానికి అనుమతి...**ఎస్‌టీపీలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని సంఘం తరపున చేసిన విజ్ఞప్తికి సింగరేణి సీఎండీ రాతపూర్వకంగా అనుమతి ఇవ్వడం పట్ల సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సింగరేణి చీఫ్ లైజన్ ఆఫీసర్ విసం కృష్ణయ్య,సంఘం అధ్యక్షుడు డి.పంతులా , జనరల్ సెక్రటరీ భూక్య నాగేశ్వరరావు,వైస్ ప్రెసిడెంట్ భూక్య వెంకటరామ్‌తో పాటు వివిధ ఏరియాలకు చెందిన లైజన్ అధికారులు,సంఘం నాయకులు,ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.గిరిజన ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్,సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడమే సమావేశం ప్రధాన ఉద్దేశమని సంఘం ప్రతినిధులు తెలిపారు.

# తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు...**



**భూపాలపల్లి, నేటిధాత్రి:** వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే సంతానంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. తల్లిదండ్రులను వేధిస్తూ, వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే వారిపై వయోవృద్ధుల సంక్షేమ చట్టం ప్రకారం చర్యలు తీసుకునే అధికారం ఉందన్నారు. అవసరమైతే పిల్లల పేరిట బదిలీ చేసిన ఆస్తులను తిరిగి తల్లిదండ్రుల పేరు మీదకు మార్చే అవకాశం కూడా ఉందని వివరించారు. అర్హులైన వయోవృద్ధులందరికీ సీనియర్ సిటిజన్ ఐడీ కార్డులు అందజేయడంతో పాటు నిబంధనల ప్రకారం రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. వయోవృద్ధులు ఆహ్లాదకరంగా సమయం గడిపేందుకు భూపాలపల్లిలోని హనుమాన్ నగర్‌లో డే కేర్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్కడ ఆటలు, భోజనం, టీ వంటి సదుపాయాలు కల్పించామన్నారు. శాశ్వత డే కేర్ సెంటర్ నిర్మాణం చేపడుతున్నామని, పనులు పూర్తయిన వెంటనే అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం ద్వారా వారి హక్కులకు చట్టపరమైన రక్షణ కల్పించిందని తెలిపారు. పిల్లలు తల్లిదండ్రుల పోషణ బాధ్యతను విస్మరిస్తే ఆర్డీఓ కోర్టు ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంక్షేమం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 1 వరకు జిల్లా వ్యాప్తంగా వయోవృద్ధుల వారోత్సవాలు నిర్వహించి పలు సేవా, అవగాహన కార్యక్రమాలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. వయోవృద్ధుల అపార అనుభవం, సలహాలు సమాజాభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని, వారికి అవసరమైన సౌకర్యాలు, సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్రా కొమురయ్య, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, డీఎంహెచ్ఓ డా మధుసూదన్, డీఆర్‌డీఓ బాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# సవాల్‌కు సిద్ధమా సమ్మిరెడ్డి?

**ఆడిట్‌కు సిద్ధం.. తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు: వరంగల్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్...**

**15 ఏళ్ల లెక్కలు చూపించండి.. మేమూ మా లెక్కలు ఇస్తాం...**



**వరంగల్, నేటిధాత్రి:** వరంగల్ లారీ అసోసియేషన్ వ్యవహారంలో మరోసారి వివాదం రాజుకుంది. తమపై చేస్తున్న ఆరోపణలకు లారీ అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కోశాధికారి వేముల భూపాల్ ఘాటుగా స్పందించారు. "సవాల్‌కు సిద్ధమా సమ్మిరెడ్డి? గతంలో 15 ఏళ్లపాటు అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జరిగిన లావాదేవీల లెక్కలు చూపించండి.. మా సంఘం లెక్కలు చూపించడానికి, ఆడిట్ చేయించడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని సవాల్ విసిరారు.

**2020లో రాజీనామా చేసింది ఎవరు?** వరంగల్ లారీ అసోసియేషన్ 1966లో ఏర్పడిందని భూపాల్ తెలిపారు. వంగాల సమ్మిరెడ్డి సుమారు 15 ఏళ్లపాటు అధ్యక్షుడిగా కొనసాగారని, 2020లో "లారీ యజమానులకు న్యాయం చేయలేకపోతున్నాం" అంటూ తనతో పాటు తన ప్యానెల్ రాజీనామా చేసిందని పేర్కొన్నారు. అనంతరం లారీ యజమానులు తనను సంప్రదించి ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారని తెలిపారు. 2023లోనూ అదే కమిటీ మరోసారి కొనసాగిందన్నారు.

**లెక్కలు అడిగితే.. రాజీనామా చేశారా?** సమ్మిరెడ్డి హయాంలో జరిగిన లావాదేవీలకు సంబంధించిన లెక్కలు అడిగినందుకే వివాదం మొదలైందని భూపాల్ ఆరోపించారు. తమ సంఘం మాత్రం లెక్కలు చూపించేందుకు సిద్ధంగా ఉందని, అవసరమైతే పూర్తిస్థాయి ఆడిటింగ్‌కు కూడా అంగీకరిస్తామని స్పష్టం చేశారు. అయితే తమపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

**'కాకతీయ' సంఘం పేరుతో పోటీ సంఘం ఎందుకు?** గత రెండు నెలలుగా కొందరు కలిసి "కాకతీయ లారీ అసోసియేషన్" పేరుతో మరో సంఘాన్ని ఏర్పాటు చేసి తమపై దుష్ప్రచారం చేస్తున్నారని భూపాల్ ఆరోపించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో తమ సంఘం చర్చించి నిర్ణయించే కిరాయిల కంటే తక్కువ ధరలకు బయట ప్రాంతాల నుంచి లారీలను తీసుకొచ్చి స్థానిక లారీ యజమానుల ఉపాధికి ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొన్నారు.



**చిన్న ఘర్షణకు పెద్ద రాద్ధాంతమా?** ఇటీవల కమలాపూర్ నుంచి ఒక లారీని తీసుకొచ్చి నిలపడంతో స్థానిక లారీ యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారని భూపాల్ తెలిపారు. ఈ సందర్భంగా స్వల్ప తోపులాట జరిగిందని, పక్కనే ఉన్న చెట్టు కొమ్మ తగిలి ఒక వ్యక్తికి గాయం కాగా దానిని పెద్దదిగా చూపిస్తూ తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు కేసులు పెట్టించారని పేర్కొన్నారు. తమ సంఘంలో సుమారు 150 మంది సభ్యులు ఉన్నారని, అవసరమైతే అందరూ వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

**ఓడిపోయిన వ్యక్తితో మరో సంఘమా?** ఇటీవల జరిగిన ఇసుక లారీ అసోసియేషన్ ఎన్నికలను కూడా భూపాల్ ప్రస్తావించారు. మొత్తం 116 ఓట్లలో 96 ఓట్లతో ఎన్నికైన వ్యక్తి ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తితో కలిసి మరో సంఘం ఏర్పాటు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు.

**సభ్యుల కుటుంబాలకు అండగా..** గతంలో లారీ యజమాని మరణించినప్పుడు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని భూపాల్ ఆరోపించారు. తమ కమిటీ ఏర్పడిన తర్వాత సభ్యుడు మరణిస్తే రూ.10 వేల సాయం అందించడంతోపాటు కుటుంబానికి అవసరమైనప్పుడు సభ్యుల నుంచి విరాళాలు సేకరించి ఆర్థిక సహాయం చేస్తున్నామని తెలిపారు. తమ సంఘంలో తెలంగాణలో లారీలతో జీవనోపాధి పొందుతున్న పేద, సింగిల్ లారీ యజమానులు, ఓనర్ కమ్ డ్రైవర్లు ఉన్నారని చెప్పారు.

**రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం?** వంగాల సమ్మిరెడ్డి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమని భూపాల్ ప్రశ్నించారు. తాను, తన కమిటీ ఎన్నికల ద్వారా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికయ్యామని స్పష్టం చేశారు.

**సభ్యుల నినాదాలు..** భూపాల్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న సమయంలో లారీ అసోసియేషన్ సభ్యులు "వంగాల సమ్మిరెడ్డి డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేశారు. దీంతో ప్రెస్‌మీట్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**'మళ్లీ మళ్లీ సంఘాలను చీల్చడం ఎందుకు?'** గతంలోనూ ఇదే తరహాలో వ్యక్తులతో తప్పుడు ప్రచారం చేయించడం, కొత్త సంఘాలు ఏర్పాటు చేయడం, లారీ యజమానుల మధ్య విభేదాలు సృష్టించడం జరుగుతోందని భూపాల్ ఆరోపించారు. స్థానిక లారీ యజమానుల ప్రయోజనాలను దెబ్బతీసే చర్యలను అడ్డుకోవాలని పోలీస్ కమిషనర్, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. "మా మీద ఆరోపణలు చేసే ముందు మీ హయాంలోని 15 ఏళ్ల లెక్కలు చూపించండి. మా లెక్కలు అడిగితే మేము సిద్ధంగా ఉన్నాం. ఆడిటింగ్‌కూ సిద్ధమే. కానీ ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం మాత్రం సరికాదు" అని వేముల భూపాల్ స్పష్టం చేశారు.

**లెక్కలు చెప్పకపోతే.. ఇళ్ల ముందు ధర్నా చేస్తాం!** సమ్మిరెడ్డి, సదానందంను హెచ్చరించిన లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భూపాల్ వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వంగాల సమ్మిరెడ్డి, సదానందం గత లావాదేవీల లెక్కలను లారీ యజమానులకు వెల్లడించాలని సంఘం ప్రస్తుత అధ్యక్షుడు వేముల భూపాల్ డిమాండ్ చేశారు. లెక్కలు వెల్లడించకుండా తప్పించుకుంటే వారి ఇళ్ల ముందు లారీ యజమానులతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు.ప్రస్తుతం సంఘం నిర్వహిస్తున్న లావాదేవీలకు సంబంధించిన లెక్కలను సభ్యుల ముందు చూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అదే విధంగా గతంలో సమ్మిరెడ్డి హయాంలో జరిగిన లావాదేవీల వివరాలను కూడా సభ్యుల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. లెక్కలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న వారు ముందుగా తమ హయాంలోని లావాదేవీల వివరాలను వెల్లడించాలని భూపాల్ అన్నారు.కార్యక్రమంలో కోశాధికారి ఎం.డి. జాకీర్‌తో పాటు 100మంది వరకు లారీ ఓనర్స్ పాల్గొన్నారు.

# పనులు త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలి.

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి.**



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల మండలం, వెంచరామి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయితే పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుందని, కేవలం దారి సమస్య కారణంగా పనులు నిలిచిపోవడం బాధాకరమన్నారు.ప్రభుత్వానికి సంబంధించిన దారిని ఎవరైనా అక్రమంగా కబ్జా చేస్తే అధికారులు వెంటనే స్పందించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ విషయంపై చిట్యాల మండల తహసీల్దార్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు వెళ్లే దారిని పరిశీలించి, కబ్జా సమస్యను తక్షణమే పరిష్కరించాలని, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకొని నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని కోరారు. బి ఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అల్లం రవీందర్, బి ఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ నవీన్ మండల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 01 అక్టోబర్ " జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం " సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతం.



**హన్మకొండ, నేటిధాత్రి:** బాలసముద్రం ఆదిత్య బిర్లా క్యాపిటల్ వన్ ఏ.బి.సి వరంగల్ బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి సహకారం తో తేదీ :- 01 అక్టోబర్ , 2026 " జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం " సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆదిత్య బిర్లా క్యాపిటల్ వన్ ఏ. బి.సి వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వివేక్ అగర్వాల్ ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందించడం జరిగింది. బ్రాంచ్ మేనేజర్ వివేక్ అగర్వాల్ మాట్లాడుతూ 18 – 60 వయసు కలిగిన యువతీ యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగింది. ఈ రక్తదాన శిబిరం లో స్వచ్ఛందంగా 20 మంది ఆదిత్య బిర్లా క్యాపిటల్ కుటుంబ సభ్యులు రక్తదానం చేయడం జరిగింది. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఆదిత్య బిర్లా క్యాపిటల్ వన్ ఏ.బి.సి వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వివేక్ అగర్వాల్, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), వి. రామకృష్ణ రెడ్డి, లేఖనా బోహ్రా, ఎస్. శ్వేత, డి. వినిక్ కుమార్, కె. దుర్గాప్రసాద్, టి. అర్జున్, ఎ. బుచ్చి రెడ్డి, సిహెచ్. భూపాల్ రెడ్డి, పృథ్వి, పి. మహేష్, జె. రాజు, మధుకర్, రాజ్ కుమార్, ధనీష్, అరుణ్ కుమార్, ఎన్. కిరణ్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, గజ్జెల సుమన్, మునిగాల రాంప్రసాద్, ఉప్పరపల్లి రాజ్ కుమార్,ఊరటి రవికుమార్, అలువల పృథ్వి, ఎస్.కె ముస్తఫా పాల్గొనడం జరిగింది.

# సింగిల్ విండో డైరెక్టర్ మేడికల తిరుపతికి ఘన సన్మానం

**మాల సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు**



**చందుర్తి, నేటిధాత్రి:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రానికి చెందిన మేడికల తిరుపతి సొసైటీ డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా మాల సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాల సంఘం సభ్యులు మాట్లాడుతూ.. రాజకీయంగా వెనుకబడిన మాల సంఘం సభ్యులను ప్రోత్సహించి, రాజకీయాల్లో ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మేడికల తిరుపతికి సొసైటీ డైరెక్టర్‌గా అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం నూతనంగా ఎన్నికైన సొసైటీ డైరెక్టర్ మేడికల తిరుపతి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో సొసైటీ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, రైతులకు అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి



**ఆర్డీడీ,టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారికి ఎమ్మార్పీఎస్ నేత ఏకు శంకర్ మాదిగ ఫిర్యాదు...**

**పరకాల, నేటిధాత్రి:** పరకాల పట్టణంలోని గొడ్ల అంగడి ముందు,ఇంటి నంబర్ 3-277 వద్ద నిబంధనలకు విరుద్ధంగా గృహ నిర్మాణం చేపడుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఏకు శంకర్ మాదిగ ఆర్డీడీ,టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.సదరు నిర్మాణానికి సంబంధించిన అనుమతులు,సెట్‌బ్యాక్‌లు,రోడ్డు ఎఫెక్టెడ్ ఏరియా,బాల్కనీ నిర్మాణం,డ్రైనేజీపై పిల్లర్ల ఏర్పాటుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించాలని కోరారు.నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకోవాలని,ప్రజా రాకపోకలకు,డ్రైనేజీ నిర్వహణకు ఇబ్బందులు కలగకుండా చూడాలని శంకర్ మాదిగ విజ్ఞప్తి చేశారు.

# సేవా సంకల్ప్ అభియాన్ అంగన్ కా ఉత్సవ్ కార్యక్రమం

**బిజెపి రాష్ట్ర సభ్యులు జన్నె మొగిలి...**



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో భారత ప్రధానినరేంద్ర మోడీ 76వ జన్మదినోత్సవ సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా జరిగే సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగాగణపురం మండల కేంద్రంలోనీ అంగన్వాడి సెంటర్ – 5, మరియు కొత్తపల్లి అంగన్వాడి సెంటర్లో కార్యక్రమాన్ని న్ని బీజేపీ గణపురం మండల పార్టీ కన్వీనర్ మంద మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈఉత్సవంలో భాగంగా గణపురం మండల కేంద్రంలోని అంగన్వాడీ టీచర్లు ఆలూరి కోమల,దుర్గం సుశీలను శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నె మొగిలి హాజరై మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం (సెప్టెంబర్ 17) సందర్భంగా భారతీయ జనతా పార్టీ బీజేపీ చేపట్టిన నెల రోజుల సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా దేశవ్యాప్తంగా అంగన్ కా ఉత్సవ్' అంగన్వాడీ ఉత్సవం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని సేవా సంకల్ప్ అభియాన్ ప్రధాని మోడీ 76వ జన్మదినం ఆయన ప్రజాజీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు ఈ నెల రోజుల సేవా కార్యక్రమాలుజరుగుతున్నాయి.అంగన్వాడీ కార్యకర్తల సేవను గుర్తించి సన్మానించడం. జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి మాదాసు మొగిలి సీనియర్ నాయకులు సోమ దామోదర్ బోద్దుల మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

# 18వ డివిజన్‌లో తాగునీటి నల్లాలు ప్రారంభం




**వరంగల్, నేటిధాత్రి:** గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ 18వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ వస్కుల బాబు తాగునీటి నల్లాలను ప్రారంభించారు. స్థానిక ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఈ నల్లాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వస్కుల బాబు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. స్థానికులు తాగునీటి నల్లాల ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు.

# గోవర్ధన్ మృతికి సర్పంచ్ కవిత మధు సంతాపం



**పరకాల, నేటిధాత్రి:** మండలంలోని మల్లక్కపేట గ్రామానికి చెందిన తాడూరి గోవర్ధన్ అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ దొమ్మటి కవిత మధు ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ,అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కక్షతో భర్తను కిరాతకంగా హతమార్చిన భార్య ఆమె ప్రియుడు

▸▸మరో వ్యక్తితో హో మద్యంలో పురుగుల మందు కలిపి కాటికి పంపించిన భార్య

▸▸భార్య ప్రియుడు సహా ముగ్గురి అరెస్ట్ 14 రోజుల రిమాండ్...

▸▸వెల్లడించిన భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు...

▸▸ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం...



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండలం బుద్ధారం గ్రామంలో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కక్షతో భర్తను కిరాతకంగా హతమార్చిన భార్య, ఆమె ప్రియుడు సహా మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన ఈ ఘటన వివరాలను డీఎస్పీ సంపత్‌రావు, సీఐ కరుణాకర్‌రావు, ఎస్సై అశోక్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పెండెల సంపత్ ప్లంబర్‌గా పనిచేస్తూ, బుద్ధారంలోని అత్తగారింట్లో భార్య సుమలత తో కలిసి నివాసముంటున్నాడు. వీరికి పదేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా బుద్ధారానికి చెందిన ఉమ్మల శ్రీకాంత్‌తో సుమలత వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయమై దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. భార్య ప్రవర్తనపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంపత్.. శ్రీకాంత్‌ను పలుమార్లు హెచ్చరించాడు. రూ. లక్ష ఒప్పందం తో హత్యకు ప్లాన్ వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్న సంపత్‌ను కడతేర్చాలని సుమలత, శ్రీకాంత్ పథకం వేశారు. హత్యకు సహకరించేందుకు అదే గ్రామానికి చెందిన పోలుదాసరి తరుణ్ అనే యువకుడికి రూ.లక్ష ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పథకం ప్రకారం ఈ నెల 17వ తేదీ రాత్రి శ్రీకాంత్, తరుణ్‌లు సంపత్‌ను మద్యం తాగుదామని నమ్మించి బుద్ధారంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల మైదానానికి తీసుకెళ్లారు. అక్కడ మద్యంలో పురుగుల మందు కలిపి సంపత్‌తో తాగించారు తీవ్ర అస్వస్థతకు గురైన సంపత్ అక్కడికక్కడే మృతి చెందాడు

# బి ఆర్ ఎస్ లో చేరిన వారికీ కాంగ్రెస్ పార్టీ కి ఎలాంటిసంభందం లేదు.

▸▸గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజు.....



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల మండలం లోని వెంచరామి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ని వీడిచి బి ర్ స్ పార్టీ లో చేరినటివంటి వారికీ కాంగ్రెస్ పార్టీ కి ఎలాంటి సంబంధం లేదని గ్రామ శాఖ అధ్యక్షులు చెట్కూరి రాజు స్పష్టమ్ చేయడం జరిగింది, గత సంవత్సరమ్ జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకుంటూ తిరిగి బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి కి మద్దతిహిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గురువారం బి ఆర్ ఎస్ లో చేరిన వ్యక్తులు వెన్నుపోటు పొదవడం జరిగింది,ఆ రోజు నుండి పార్టీ నుండి పక్కన పెట్టడం జరిగింది అందులో ని కొంతమంది వ్యక్తులు మా పార్టీ కి సంబంధం లేకుండా మా పార్టీ వ్యక్తులు అని ప్రచారం చేస్తున్నారు, ఈ లాంటి మోసపూరిత ప్రచారాన్ని వెంచరామి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కండి స్తున్నది, ఇలాంటి వారు పార్టీ లు మారినంత మాత్రనా మా పార్టీ కి ఎలాంటి నష్టం లేదువాళ్ళు ఎలాంటి వారో బి ఆర్ ఎస్ పార్టీ వాళ్లకి బాగా తెలుసు అని అన్నారు,ఈ కార్యక్రమం లో పాల్గొన్న కార్యకర్తలు అధ్యక్షులు చెట్కూరి రాజు మాజీ అధ్యక్షులు నాయిని స్వామి కార్యదర్శి కళ్లేపల్లి చిన్న సదయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు :కచ్చు శ్రీనివాస్ బొమ్మ నరందర్ అందుగుల వీరాస్వామి అంతటి కుమార్ కేంద రాజయ్య రావుల మధుసూదన్ చెనవేణి మల్లేష్ గుర్రం కుమార్ దాసరి అనిల్ మేకల శ్రవణ్ దాసరి మహేందర్ మల్లారపు చంద్రయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

# డాక్టర్ దశరథ్ కు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్ గా నియామకం

▸▸ఎల్ హెచ్ పి ఎస్ నాయకుల ఘన సన్మానం...

▸▸లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్ పి ఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి భూక్యా కోటియా నాయక్..



**కోదాడ, నేటిధాత్రి:** సీనియర్ సర్జన్, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ దశరథ్ ఎంఎస్ కు అరుదైన గౌరవం దక్కింది. ఆయన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్ గా నియమితులయ్యారు. ఒక గిరిజన బిడ్డకు ఇంతటి ఉన్నతమైన పదవి దక్కడం పట్ల గిరిజన సమాజం, వివిధ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్ పి ఎస్) నాయకులు, గిరిజన యువకులు డాక్టర్ దశరథ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఘనంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. గిరిజన బిడ్డకు దక్కిన అరుదైన గౌరవం పట్ల ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి భూక్యా కోటియా నాయక్ మాట్లాడుతూ.. గిరిజన సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ దశరథ్ (ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్ గా నియమితులు కావడం గిరిజన జాతికి గర్వకారణమన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వైద్య సేవలు అందిస్తున్న ఆయనకు ఈ పదవి దక్కడం అత్యంత సమంజసమని కొనియాడారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఆయన భవిష్యత్తులో మరింత మంది పేదలకు, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల ప్రజలకు విస్తృత సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అభినందనలు కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు నాయక్, జిల్లా అధ్యక్షుడు భూక్య రవి నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ సర్పంచుల పోరం రాష్ట్ర నాయకుడు బానోతు నందలాల్, రాంప్రసాద్, చంద్రశేఖర్, భూక్యా నిఖిల్ , నాగేందర్, భద్రు, వాసు, గోపి రాథోడ్, బాలు, మరియు స్థానిక ముఖ్య నాయకులు, పెద్ద సంఖ్యలో గిరిజన యువకులు మేధావులు పాల్గొని డాక్టర్ దశరథుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మందమర్రి పోలీస్ స్టేషన్‌లో సీపీ వార్షిక తనిఖీ

▸▸నేరాలు,మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి...

▸▸రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా....



**మంచిర్యాల, నేటిధాత్రి:** మందమర్రి ప్రాంతంలో నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి నేర రహిత,మాదకద్రవ్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పోలీస్ అధికారులను ఆదేశించారు.

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మందమర్రి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీకి మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్,మందమర్రి ఎస్ఐ నరేష్ మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సీపీ పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రిసెప్షన్ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు,సిబ్బంది బ్యారక్‌ను పరిశుభ్రంగా ఉంచాలని,అన్ని రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ సిబ్బందితో మాట్లాడిన సీపీ ఆన్‌లైన్‌లో వివరాల నమోదు,రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమై వారి వ్యక్తిగత,శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాలు,పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి,రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు,నేర నియంత్రణ చర్యలు,విజిబుల్ పోలీసింగ్,పెట్రోలింగ్ తదితర అంశాలపై ఎస్ఐను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మందమర్రి సింగరేణి పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇక్కడ ప్రత్యేక సవాళ్లు ఉన్నాయని సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో జరిగే దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి వారి కదలికలను పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో నిబంధనల ప్రకారం గ్యాంగ్ ఫైళ్లను ప్రారంభించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మరింత మెరుగైన,వేగవంతమైన పోలీస్ సేవలు అందించేలా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సీపీ ఆదేశించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# నర్సంపేటలో వైభవంగా 'బొడ్డెమ్మ' ప్రతిష్ఠ

▸▸తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవాలి:మోర్తాల దంపతులు....

▸▸ఘనంగా ప్రారంభమైన ఉత్సవాలు...





**నర్సంపేట, నేటిధాత్రి:**తెలంగాణ సంప్రదాయ సౌరభం ఇనుమడించేలా, ఆడపడుచుల ఐక్యతకు, కుటుంబ సౌభాగ్యానికి ప్రతీకగా నిలిచే బొడ్డెమ్మ పండుగ వేడుకలు నర్సంపేట పట్టణంలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నర్సంపేట వినాయక మిత్రమండలి మహిళల ఆధ్వర్యంలో వార్షిక ఆనవాయితీ ప్రకారం భక్తిశ్రద్ధల నడుమ ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ వేడుకల్లో భాగంగా కేఎస్ఆర్ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మోర్తాల మాధురి--రామరాజు దంపతులు గృహంలో కోలాటాలు, మంగళనీరాజనాల నడుమ బొడ్డెమ్మ అమ్మవారిని సంప్రదాయబద్ధంగా ప్రతిష్ఠించారు. అనంతరం స్థానిక మహిళలంతా ఏకమై సంప్రదాయ దుస్తుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమలతో పూజించిన మహిళలు.. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, బొడ్డెమ్మ పాటలు పాడుతూ, కోలాటాలాడుతూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు.



**▸▸సంస్కృతిని నేటి తరానికి అందించడమే లక్ష్యం:** ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మోర్తాల మాధురి--రామరాజు దంపతులు మాట్లాడుతూ.. అనాదిగా వస్తున్న పూర్వీకుల సంప్రదాయాన్ని, బొడ్డెమ్మ పండుగ విశిష్టతను నేటి తరానికి అందించాలనే ఉద్దేశంతోనే ప్రతి ఏటా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మకు ముందు బొడ్డెమ్మను జరుపుకోవడం ఆచారమని పేర్కొన్నారు. పట్టణ ప్రముఖులు, మహిళల సహకారంతో తమ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గత 8 ఏళ్లుగా ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహిస్తుండటం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో దివ్య కమలాకర్,డాక్టర్ అమల రవికృష్ణ, రాజేశ్వరి, స్వప్న, రమా, రాజులతో పాటు పట్టణ ప్రముఖులు జయపాల్ రెడ్డి, సత్యనారాయణ, కమలాకరాచారి, శ్రీధర్, శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డి, అల్లంరాజుతో స్థానిక మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల హక్కులపై అవగాహన అవసరం

▸▸జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య....



**మంచిర్యాల, నేటిధాత్రి:** వయోవృద్ధులు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్,ఎస్సీ అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్,అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి, వయోవృద్ధుల సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పి.చంద్రయ్య మాట్లాడుతూ వయోవృద్ధులు సమాజానికి విలువైన సంపద అని అన్నారు. వారి అనుభవం, సలహాలు,సూచనలు సమాజ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ ఆస్తులు,భూములను పిల్లలకు బదలాయించిన అనంతరం నిర్లక్ష్యానికి గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆస్తిపాస్తులు లేని వయోవృద్ధులను పిల్లలు బాధ్యతగా చూసుకోవాలని తెలిపారు. వయోవృద్ధుల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా ముఖ్యమని, క్రమం తప్పకుండా నడక,యోగా వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలు కొనసాగించాలని సూచించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాల ద్వారా వయోవృద్ధులకు రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ,పోలీసు శాఖల ఆధ్వర్యంలో చట్టాల అమలుతో పాటు గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 35,250 మంది వయోవృద్ధులు వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారని,వారికి ప్రతి నెలా పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు,మహిళా సంఘాల ప్రతినిధులు గ్రామాల్లో వయోవృద్ధుల హక్కులు, సంక్షేమంపై అవగాహన కల్పించాలని సూచించారు. చట్టపరమైన హక్కులు తెలుసుకోవాలి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ వయోవృద్ధులు తమకు కల్పించిన చట్టపరమైన హక్కులపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టం--2007లోని సెక్షన్ 23 ప్రకారం, నిర్దిష్ట పరిస్థితుల్లో వయోవృద్ధులు బదలాయించిన ఆస్తిని రద్దు చేసే అధికారం ఆర్‌డీఓకు ఉంటుందని వివరించారు. అలాగే సెక్షన్ 24 ప్రకారం వయోవృద్ధులు, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు,జరిమానా వంటి నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే సందర్భాల్లో నిబంధనల ప్రకారం వారి జీతం నుంచి తల్లిదండ్రుల పోషణకు చెల్లింపులు చేయించే అవకాశం ఉందన్నారు. ప్రతి మంగళవారం డే కేర్ సెంటర్లలో వయోవృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వయోవృద్ధుల సమస్యలు,సహాయం కోసం 14567 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వయోవృద్ధులను అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వయోవృద్ధులు,సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సామాజిక సేవకులకు సముచిత స్థానం



▸▸ఇండియన్ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ శానబోయిన రాజ్‌కుమార్‌కు ఘన సన్మానం...

▸▸హాజరైన ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి...

▸▸రైతులు, మత్స్యకారులను ఆదుకోవాలని డిమాండ్....

**దుగ్గొండి, నేటిధాత్రి:** సమాజ సేవలో నిరంతరం ముందుంటూ, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న శానబోయిన రాజ్‌కుమార్ ముదిరాజ్ సేవా దృక్పథానికి తగిన గుర్తింపు లభించిందని ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి ముదిరాజ్ పేర్కొన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన శానబోయిన రాజ్‌కుమార్‌ను దుగ్గొండి మండల ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో గిర్నిబావిలోని కనిష్క ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు పల్లె రమేష్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం మొగిలి మాట్లాడుతూ.. రాజ్‌కుమార్ వైస్ చైర్మన్‌గా నియామకమవ్వడం ముదిరాజ్ జాతికే గర్వకారణమన్నారు. కాగా, సరైన వర్షాలు లేక చెరువుల్లోకి నీరు రాకపోవడంతో ఉపాధి కోల్పోయి అయోమయంలో ఉన్న ముదిరాజ్ కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ పరిధిని కరువు ప్రాంతంగా ప్రకటించి, చెరువుల శిస్తును మాఫీ చేయాలని, సబ్సిడీ రూపంలో ఇచ్చే చేప పిల్లలకు బదులుగా ఆ నగదును నేరుగా మత్స్య సహకార సంఘాల ఖాతాల్లో వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సన్మాన గ్రహీత శానబోయిన రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన కుల పెద్దలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తానని, నాయకులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ముదిరాజ్ సేవాసమితి సేవకుడు దండు చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శి నేదురు రాజేందర్, ఉపాధ్యక్షులు ఓరుగంటి తిరుపతి, మంద దేవరాజు, సారా రాములు, యూత్ అధ్యక్షుడు ఈర్ల నరేష్, జిల్లా నాయకులు ఓరంగంటి అశోక్, గొర్రె రాంబాబు, మండల ఉపాధ్యక్షుడు చాగంటి రాజు, మండల సహ కార్యదర్శి, రేకంపల్లి ఉపసర్పంచ్ పొన్నం వంశీ, కానుగుల రమేష్, గొర్రె రమేష్, లక్క రమేష్, మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు సోద సమ్మయ్య,గంగరబోయిన రాజు, తుమ్మనపల్లి మహేందర్, తుమ్మలపల్లి రాజు, జటబోయిన రాజు, గొర్రె రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి




రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**మంచిర్యాల, నేటిధాత్రి:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు,ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు,ఎన్నికల విభాగం అధికారులతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, మ్యాపింగ్ కాని ఓటర్లు, అనమలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, వారి ఇండ్లకు వెళ్లి వారి నుంచి ధృవపత్రాల స్వీకరణ,వివరాల డిజిటలైజేషన్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి బూత్ స్థాయి అధికారులు ఓటర్ల ఇండ్ల వద్దకు వెళ్లి అవసరమైన ధృవపత్రాలను సేకరించాలని తెలిపారు. ఎ.ఈ.ఆర్.ఓ.లు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు,సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసే విధంగా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా,పారదర్శకంగా కొనసాగేందుకు సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో నోటీసులు జారీ చేయబడిన ఓటర్లకు సంబంధించి వారి ఇండ్ల వద్ద అవసరమైన ధృవపత్రాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు,జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ,ఎఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి

▸▸ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలి...

▸▸జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య...



**మంచిర్యాల, నేటిధాత్రి:**జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, పారిశుధ్య, సంక్షేమ,విద్యా కార్యక్రమాలను మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల మార్కెట్ ప్రాంతంలో జరుగుతున్న నగరాభివృద్ధి పనులను ప్రజలు,వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో చేపట్టాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరి పుష్కర ఘాట్ ప్రాంతాన్ని సందర్శించిన ఆయన అభివృద్ధి పనుల కోసం గుర్తించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజలు, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

**▸▸పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ...** ఎన్‌టీఆర్ నగర్ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన అదనపు కలెక్టర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. చెత్త సేకరణ,పారిశుధ్య నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు,సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యటనలో భాగంగా ఓ ఇంటి వద్ద నీరు వృథాగా పోతుండటాన్ని గమనించిన ఆయన నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**▸▸విద్యార్థుల అభ్యసన స్థాయిపై దృష్టి....**ప్రాథమిక పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ పాఠశాల నిర్వహణ,విద్యార్థుల హాజరు,విద్యా ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు. ఎఫ్ఆర్ఎస్ ఆధారిత హాజరు నమోదును పరిశీలించి విద్యార్థుల హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన అందించాలని,విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అవసరమైన అదనపు బోధన అందించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు,ప్రభుత్వ సేవలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాజు,మున్సిపల్ డిప్యూటీ ఈఈ,మున్సిపల్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భర్త,అత్తమామల 'లండన్' డ్రామా..
# కట్నం నొక్కేసి విదేశాలకు జంప్!

●కట్నంగా ఇచ్చిన 191 గజాల ప్లాటును అమ్మించి రూ. 40 లక్షలు దండుకున్న భర్త, ఆడపడుచు

●బంగారం,రూ. 5 లక్షల నగదు లాక్కొని దాడి చేసి నర్సంపేటకు తరిమేసిన వైనం

●అత్తమామల మనోవేదన..ఆడపడుచు స్థలం వద్ద ఆందోళన చేయగా బాధితురాలిపై భౌతిక దాడి






పవన్ కుమార్ దివ్య ల వివాహ ఫైల్ ఫోటో



లండన్ విమానాశ్రయంలో పవన్ కుమార్ దివ్య ల ఫైల్ ఫోటో



పవన్ కుమార్ దివ్య వివాహంలో తల్లిదండ్రుల ఫైల్ ఫోటో

నర్సంపేట, నేటిధాత్రి:

లండన్ పేరుతో మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్న భర్త కట్నం నొక్కేసి విదేశాలకు జంపాయ్యాడు. దిక్కులేని స్థితిలో బాధితురాలు తనకు న్యాయం జరగాలంటూ పోరాటానికి దిగింది ఈ సంఘటన నర్సంపేట పట్టణంలో గురువారం చోటు చేసుకున్నది.

కట్నం కింద ఇచ్చిన ప్లాటును నమ్మించి అమ్మించేసి, బంగారం, నగదు గుంజుకొని అదనపు కట్నంకోసం తీవ్రంగా వేధించడమే కాకుండా, విదేశాలకు పారిపోయిన భర్త, అందుకు సహకరించిన అత్తమామలపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితురాలు దివ్య డిమాండ్ చేశారు.నర్సంపేట పట్టణానికి చెందిన కొండ్లే రజిత-సతీష్ కుమార్ దంపతుల కుమార్తె దివ్యకు, వరంగల్ శివనగర్‌కు చెందిన మచ్చ రాజమణి-శ్రీహరి కుమారుడు పవన్ కుమార్‌తో 2022 ఆగస్టు 17న వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్నకానుకల కింద 191 గజాల ప్లాట్, 8 తులాల బంగారం, రూ. 5 లక్షల నగదు ఇచ్చారు.

లండన్‌లో ఇల్లు కొంటామని నమ్మించి ప్లాటు విక్రయం భర్త పవన్ కుమార్ లండన్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడని నమ్మించి పెళ్లి చేసుకున్నారని బాధితురాలు తెలిపారు. వివాహమైన 6 నెలల తర్వాత పవన్ లండన్ వెళ్తూ, ఆ తర్వాత 10 నెలలకు దివ్యను అక్కడికి తీసుకెళ్లాడు. అయితే లండన్ వెళ్లిన నెల రోజులకే ఇద్దరూ వరంగల్ తిరిగివచ్చి, రెండు సంవత్సరాల పాటు ఇక్కడే నివాసముంటూ కాపురం చేశారు. ఈ క్రమంలో లండన్‌లో రూ. 5 కోట్లతో ఇల్లు కొనుగోలు చేయాలని, అందుకు కట్నంగా ఇచ్చిన ప్లాటును అమ్మేయాలని భర్త పవన్ కుమార్, అతని సోదరి (ఆడపడుచు) మార్త ప్రశాంతి నాటకమాడి నమ్మబలికారు.వారి మాటలు నిజమేనని నమ్మిన దివ్య, తన తల్లిదండ్రులను ఒప్పించి నర్సంపేటలోని 191 గజాల ప్లాటును 2023 డిసెంబర్‌లో రూ. 40 లక్షలకు విక్రయించి ఆ మొత్తాన్ని భర్తకు అందించింది.

## దాడి చేసి తరిమేసి.. విదేశాలకు పరారీ!

ప్లాటు అమ్మిన డబ్బులు చేతికి వచ్చిన తర్వాత రెండేళ్ల పాటు కాలయాపన చేసిన భర్త, ఆడపడుచు మార్త ప్రశాంతి ప్రోద్బలంతో దివ్యను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం మొదలుపెట్టాడు. ఆమె వద్ద ఉన్న బంగారం, నగదును లాక్కుని, భౌతికంగా దాడి చేసి 2025 ఏప్రిల్‌లో నర్సంపేటకు తరిమేశారు. ఆ తర్వాత బాధితురాలికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భర్త పవన్ కుమార్ లండన్ వెళ్లిపోయాడు. గడిచిన ఏడాదిన్నర కాలంగా భర్త వద్దకు వెళ్లేందుకు దివ్య ప్రయత్నించగా, అత్తమామలు రాజమణి-శ్రీహరి, ఆడపడుచు ప్రశాంతి తీవ్ర మనోవేదనకు గురిచేస్తూ, కనీసం ఫోన్‌లో కూడా మాట్లాడనీయకుండా అడ్డుపడ్డారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆడపడుచు కొడుకు దాడి.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

తనకు జరిగిన అన్యాయంపై ఆడపడుచు మార్త ప్రశాంతి, నాగరాజు పేరున ఉన్న భూమి వద్ద బాధితురాలు దివ్య తన తల్లి రజితతో కలిసి నిరసనకు దిగగా, ప్రశాంతి కుమారుడు మార్త మాధవ్ తనపై దాడి చేసి గాయపరిచాడని, అసభ్యంగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడాడని దివ్య ఆరోపించారు. తనపై దాడికి పాల్పడిన మాధవ్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు వెల్లడించారు. అధికారులు తక్షణమే స్పందించి నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని, తనకు, తన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# మాడిపల్లిలో ఘనంగా సహభాగిత గ్రామీణ మదింపు

రైతులు-విద్యార్థుల భాగస్వామ్యంతో గ్రామ వనరులు, సమస్యలపై అధ్యయనం



హసన్‌పర్తి, నేటిధాత్రి:

మాడిపల్లి గ్రామంలో ఎస్ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా సహభాగిత గ్రామీణ మదింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డా. జి. భూపాల్ రాజ్, ఏడీవో బి. ఆది రెడ్డి, ఏఓ అనురాధ, ఏఈఓ సుమన్, గ్రామ సమన్వయకర్త డా. జి. భార్గవి, గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమం సమన్వయకర్త టి. సాయి కృష్ణ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామస్థులతో కలిసి సామాజిక మ్యాప్, వనరుల మ్యాప్, పంటల శాతం, నేలల రకాలు, గ్రామ చరిత్ర కాలక్రమం, సమస్యల వృక్షం, చలనశీలత మ్యాప్, వెన్ చిత్రపటం, కాలానుగుణ క్యాలెండర్ తదితరాలను రూపొందించి ప్రదర్శించారు. విద్యార్థుల కృషి, చక్కటి ప్రదర్శనతో పాటు రైతులతో కలిసి కొత్త విషయాలను నేర్చుకుంటున్న విధానాన్ని ఏడీవో బి. ఆది రెడ్డి, ఏఓ అనురాధ అభినందించారు. వ్యవసాయ, ప్రభుత్వ కార్యక్రమాల్లో విద్యార్థులు--రైతుల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఏఓ పేర్కొన్నారు.

డీన్ డా. జి. భూపాల్ రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ పరిస్థితులను ప్రత్యక్షంగా అర్థం చేసుకునేందుకు గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమం, సహభాగిత గ్రామీణ మదింపు కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులు, విద్యార్థులు తమ అభిప్రాయాలను, అనుభవాలను పంచుకున్నారు. సహభాగిత గ్రామీణ మదింపు ద్వారా గ్రామంలోని వనరులు, సమస్యలు, వ్యవసాయ పరిస్థితులను సమగ్రంగా తెలుసుకునే అవకాశం కలిగిందని రైతులు తెలిపారు.

గ్రామ సమన్వయకర్త డా. జి. భార్గవి మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరైన అధికారులు, అధ్యాపకులు, రైతులు, గ్రామస్థులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

# సవాల్‌కు సిద్ధమా సమ్మిరెడ్డి?




●15 ఏళ్ల లెక్కలు చూపించండి.. మేమూ మా లెక్కలు ఇస్తాం

●ఆడిట్‌కు సిద్ధం.. తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు: వరంగల్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్



వరంగల్, నేటిధాత్రి:

వరంగల్ లారీ అసోసియేషన్ వ్యవహారంలో మరోసారి వివాదం రాజుకుంది. తమపై చేస్తున్న ఆరోపణలకు లారీ అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కోశాధికారి వేముల భూపాల్ ఘాటుగా స్పందించారు. "సవాల్‌కు సిద్ధమా సమ్మిరెడ్డి? గతంలో 15 ఏళ్లపాటు అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జరిగిన లావాదేవీల లెక్కలు చూపించండి.. మా సంఘం లెక్కలు చూపించడానికి, ఆడిట్ చేయించడానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని సవాల్ విసిరారు.

## 2020లో రాజీనామా చేసింది ఎవరు?

వరంగల్ లారీ అసోసియేషన్ 1966లో ఏర్పడిందని భూపాల్ తెలిపారు. వంగాల సమ్మిరెడ్డి సుమారు 15 ఏళ్లపాటు అధ్యక్షుడిగా కొనసాగారని, 2020లో "లారీ యజమానులకు న్యాయం చేయలేకపోతున్నాం" అంటూ తనతో పాటు తన ప్యానెల్ రాజీనామా చేసిందని పేర్కొన్నారు. అనంతరం లారీ యజమానులు తనను సంప్రదించి ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారని తెలిపారు. 2023లోనూ అదే కమిటీ మరోసారి కొనసాగిందన్నారు.

## లెక్కలు అడిగితే.. రాజీనామా చేశారా?

సమ్మిరెడ్డి హయాంలో జరిగిన లావాదేవీలకు సంబంధించిన లెక్కలు అడిగినందుకే వివాదం మొదలైందని భూపాల్ ఆరోపించారు. తమ సంఘం మాత్రం లెక్కలు చూపించేందుకు సిద్ధంగా ఉందని, అవసరమైతే పూర్తిస్థాయి ఆడిటింగ్‌కు కూడా అంగీకరిస్తామని స్పష్టం చేశారు. అయితే తమపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

## 'కాకతీయ' సంఘం పేరుతో పోటీ సంఘం ఎందుకు?

గత రెండు నెలలుగా కొందరు కలిసి "కాకతీయ లారీ అసోసియేషన్" పేరుతో మరో సంఘాన్ని ఏర్పాటు చేసి తమపై దుష్ప్రచారం చేస్తున్నారని భూపాల్ ఆరోపించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో తమ సంఘం చర్చించి నిర్ణయించే కిరాయిల కంటే తక్కువ ధరలకు బయట ప్రాంతాల నుంచి లారీలను తీసుకొచ్చి స్థానిక లారీ యజమానుల ఉపాధికి ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొన్నారు.



## చిన్న ఘర్షణకు పెద్ద రాద్ధాంతమా?

ఇటీవల కమలాపూర్ నుంచి ఒక లారీని తీసుకొచ్చి నిలపడంతో స్థానిక లారీ యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారని భూపాల్ తెలిపారు. ఈ సందర్భంగా స్వల్ప తోపులాట జరిగిందని, పక్కనే ఉన్న చెట్టు కొమ్మ తగిలి ఒక వ్యక్తికి గాయం కాగా దానిని పెద్దదిగా చూపిస్తూ తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు కేసులు పెట్టించారని పేర్కొన్నారు. తమ సంఘంలో సుమారు 150 మంది సభ్యులు ఉన్నారని, అవసరమైతే అందరూ వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## ఓడిపోయిన వ్యక్తితో మరో సంఘమా?

ఇటీవల జరిగిన ఇసుక లారీ అసోసియేషన్ ఎన్నికలను కూడా భూపాల్ ప్రస్తావించారు. మొత్తం 116 ఓట్లలో 96 ఓట్లతో ఎన్నికైన వ్యక్తి ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఓడిపోయిన వ్యక్తితో కలిసి మరో సంఘం ఏర్పాటు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు.

## సభ్యుల కుటుంబాలకు అండగా..

గతంలో లారీ యజమాని మరణించినప్పుడు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని భూపాల్ ఆరోపించారు. తమ కమిటీ ఏర్పడిన తర్వాత సభ్యుడు మరణిస్తే రూ. 10 వేల సాయం అందించడంతోపాటు కుటుంబానికి అవసరమైనప్పుడు సభ్యుల నుంచి విరాళాలు సేకరించి ఆర్థిక సహాయం చేస్తున్నామని తెలిపారు. తమ సంఘంలో తెలంగాణలో లారీలతో జీవనోపాధి పొందుతున్న పేద, సింగిల్ లారీ యజమానులు, ఓనర్ కమ్ డ్రైవర్లు ఉన్నారని చెప్పారు.

## సభ్యుల నినాదాలు..

భూపాల్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న సమయంలో లారీ అసోసియేషన్ సభ్యులు "వంగాల సమ్మిరెడ్డి డౌన్ డౌన్" అంటూ నినాదాలు చేశారు. దీంతో ప్రెస్‌మీట్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం?

వంగాల సమ్మిరెడ్డి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమని భూపాల్ ప్రశ్నించారు. తాను, తన కమిటీ ఎన్నికల ద్వారా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికయ్యామని స్పష్టం చేశారు.

## 'మళ్లీ మళ్లీ సంఘాలను చీల్చడం ఎందుకు?'

గతంలోనూ ఇదే తరహాలో వ్యక్తులతో తప్పుడు ప్రచారం చేయించడం, కొత్త సంఘాలు ఏర్పాటు చేయడం, లారీ యజమానుల మధ్య విభేదాలు సృష్టించడం జరుగుతోందని భూపాల్ ఆరోపించారు. స్థానిక లారీ యజమానుల ప్రయోజనాలను దెబ్బతీసే చర్యలను అడ్డుకోవాలని పోలీస్ కమిషనర్, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. "మా మీద ఆరోపణలు చేసే ముందు మీ హయాంలోని 15 ఏళ్ల లెక్కలు చూపించండి. మా లెక్కలు అడిగితే మేము సిద్ధంగా ఉన్నాం. ఆడిటింగ్‌కూ సిద్ధమే. కానీ ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం మాత్రం సరికాదు" అని వేముల భూపాల్ స్పష్టం చేశారు.



## లెక్కలు చెప్పకపోతే.. ఇళ్ల ముందు ధర్నా చేస్తాం! సమ్మిరెడ్డి, సదానందంను హెచ్చరించిన లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భూపాల్

వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వంగాల సమ్మిరెడ్డి, సదానందం గత లావాదేవీల లెక్కలను లారీ యజమానులకు వెల్లడించాలని సంఘం ప్రస్తుత అధ్యక్షుడు వేముల భూపాల్ డిమాండ్ చేశారు. లెక్కలు వెల్లడించకుండా తప్పించుకుంటే వారి ఇళ్ల ముందు లారీ యజమానులతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు. ప్రస్తుతం సంఘం నిర్వహిస్తున్న లావాదేవీలకు సంబంధించిన లెక్కలను సభ్యుల ముందు చూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అదే విధంగా గతంలో సమ్మిరెడ్డి హయాంలో జరిగిన లావాదేవీల వివరాలను కూడా సభ్యుల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. లెక్కలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న వారు ముందుగా తమ హయాంలోని లావాదేవీల వివరాలను వెల్లడించాలని భూపాల్ అన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఎం.డి. జాకీర్‌తో పాటు 100మంది వరకు లారీ ఓనర్స్ పాల్గొన్నారు.

# జయహో స్మిత్ మచ్చార్!

●గాల్లోనే కో-పైలట్ కత్తి దాడి.. రక్తమోడుతూనే కాక్‌పిట్ తలుపు తెరిచిన కెప్టెన్

●14 వేల అడుగుల మేర ఒక్కసారిగా కిందికి దూసుకెళ్లిన విమానం

●ప్రయాణికులు, మరో పైలట్ల బృందం రంగంలోకి.. సౌదీలో సురక్షిత ల్యాండింగ్

●174 మందికి పైగా ప్రాణాలు కాపాడిన భారత సంతతి పైలట్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు

డెస్క్, నేటిధాత్రి:

దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో సెప్టెంబర్ 30న పెను ప్రమాదం తప్పింది. విమానం గాల్లో ఉండగానే కో-పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై కత్తితో దాడి చేసినట్లు అధికారులు, అంతర్జాతీయ మీడియా నివేదికలు వెల్లడించాయి. తీవ్రంగా గాయపడినప్పటికీ స్మిత్ మచ్చార్ సమయస్ఫూర్తితో వ్యవహరించి కాక్‌పిట్ తలుపును అన్‌లాక్ చేయడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి వెళ్లి దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానంలో ఉన్న మరో ఇద్దరు పైలట్లు నియంత్రణ చేపట్టి విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయంలో సురక్షితంగా దించారు.

## 30 సెకన్లలో 14 వేల అడుగులు కిందకు..

బోయింగ్ 737 మ్యాక్స్-8 విమానం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తుండగా కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. కో-పైలట్ స్మిత్ మచ్చార్‌పై దాడి చేసి విమాన నియంత్రణ వ్యవస్థల వద్దకు వెళ్లినట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. ఈ సమయంలో విమానం అత్యంత వేగంగా ఎత్తు కోల్పోయింది. విమాన ట్రాకింగ్ సమాచారం ప్రకారం సుమారు 33 వేల అడుగుల ఎత్తు నుంచి 14 వేల అడుగులకు పైగా తక్కువ ఎత్తుకు విమానం పడిపోయింది. అత్యవసర సంకేతాలు కూడా వెలువడ్డాయి.

## రక్తమోడుతూనే తలుపు తెరిచారు..

కాక్‌పిట్‌లో తీవ్రంగా గాయపడిన స్మిత్ మచ్చార్ నేలపై పడిపోయినప్పటికీ చివరి శక్తిని కూడదీసుకుని కాక్‌పిట్ తలుపును అన్‌లాక్ చేసినట్లు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయ ప్రతినిధి వెల్లడించారు. తలుపు తెరుచుకోవడంతో పరిస్థితిని గమనించిన ప్రయాణికులు, సిబ్బంది వెంటనే కాక్‌పిట్‌లోకి వెళ్లారు. అక్కడ గాయపడిన కెప్టెన్ నేలపై ఉండగా, మరో వ్యక్తి నియంత్రణ వ్యవస్థల వద్ద ఉన్నట్లు ప్రయాణికులు వివరించారు. అతడిని నియంత్రణల నుంచి దూరంగా తీసుకెళ్లి అదుపులోకి తీసుకున్నారు.

## యానివ్.. ప్రయాణికుడి సాహసం

కాక్‌పిట్‌లో జరిగిన ఘటనను గుర్తించిన ఇజ్రాయెల్‌కు చెందిన యానివ్ హయూన్ వెంటనే అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆయనతో పాటు మరో ప్రయాణికుడు కూడా కాక్‌పిట్ వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో తనతో వచ్చిన వ్యక్తి విధుల్లో లేని పైలట్ అని తర్వాత తెలిసిందని హయూన్ తెలిపారు. తలుపు తెరుచుకున్న తర్వాత లోపలికి వెళ్లి దాడి చేసిన వ్యక్తిని నియంత్రించేందుకు సహకరించారు.

విమానంలో ఒక్కసారిగా లైట్లు ఆగిపోవడం, గాలి పీడనంలో మార్పును గమనించడంతో ఏదో సమస్య తలెత్తిందని భావించి కాక్‌పిట్ వైపు వెళ్లినట్లు హయూన్ చెప్పారు. లోపలికి వెళ్లినప్పుడు ఒక పైలట్ నేలపై ఉండగా.. మరో వ్యక్తి విమాన నియంత్రణల వద్ద ఉన్నట్లు తెలిపారు. విమానం ఎత్తు తగ్గుతున్నట్లు అనిపించడంతో నియంత్రణలను పట్టుకుని వెనక్కి లాగినట్లు చెప్పారు. విమానం ఎలా నడపాలో ప్రత్యేక శిక్షణ లేకపోయినా, గతంలో టీవీలో చూసిన విమాన ప్రమాదాల కార్యక్రమాల ద్వారా గుర్తున్న విషయాలు ఆ సమయంలో ఉపయోగపడ్డాయని వివరించారు.

## తబూక్‌లో సురక్షితంగా..

పరిస్థితిని అదుపులోకి తీసుకున్న అనంతరం విమానంలో ప్రయాణిస్తున్న విధుల్లో లేని పైలట్లు, సిబ్బంది విమాన నియంత్రణను చేపట్టారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలో 174 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. అనంతరం ప్రయాణికులకు సహాయక చర్యలు అందించి, ప్రత్యామ్నాయ విమానంలో టెల్ అవీవ్‌కు తరలించారు.

## స్పైస్‌జెట్‌లో 11 ఏళ్ల సేవ

గుజరాత్‌కు చెందిన స్మిత్ మచ్చార్‌కు వాణిజ్య విమానయాన రంగంలో 13 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. 2011 జూన్ నుంచి 2022 జూన్ వరకు దాదాపు 11 ఏళ్లపాటు స్పైస్‌జెట్‌లో పనిచేశారు. సీనియర్ కమాండర్‌గా, లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2020 నవంబర్ నుంచి 2022 జూన్ వరకు ఇతర పైలట్లకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించారు. 2022 జూన్‌లో ఫ్లైదుబాయ్‌లో కెప్టెన్‌గా చేరారు. బోయింగ్ 737 విమానాల నిర్వహణలో ఆయనకు విస్తృత అనుభవం ఉంది. 737-800, 737 మ్యాక్స్ విమానాలను కలిపి 9,500 గంటలకు పైగా నడిపిన అనుభవం ఉన్నట్లు ఆయన వృత్తిపరమైన వివరాలను ఉటంకిస్తూ నివేదికలు పేర్కొన్నాయి. ప్రస్తుతం దుబాయ్‌లో నివసిస్తూ ఫ్లైదుబాయ్‌లో పైలట్‌గా సేవలందిస్తున్నారు.

## ప్రపంచ నేతల ప్రశంసలు

స్మిత్ మచ్చార్ ప్రదర్శించిన ధైర్యసాహసాలను పలువురు ప్రముఖులు ప్రశంసించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్మిత్ మచ్చార్‌ను హీరోగా అభివర్ణిస్తూ.. తీవ్రంగా గాయపడినప్పటికీ కాక్‌పిట్ తలుపు తెరిచి ప్రయాణికులు, సిబ్బంది దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకునే అవకాశం కల్పించారని కొనియాడారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ ఘటనపై స్పందిస్తూ స్మిత్ మచ్చార్ తీవ్రంగా గాయపడినా సమయస్ఫూర్తితో వ్యవహరించారని ప్రశంసించినట్లు నివేదికలు వెల్లడించాయి. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం స్మిత్ మచ్చార్ ధైర్యాన్ని కొనియాడుతూ, అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో గాయపడినా ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ఆయన చూపిన ధైర్యం, అచంచల సంకల్పం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన శౌర్యం పెద్ద విషాదాన్ని నివారించిందని తెలిపారు.

## యానివ్‌కు నెతన్యాహు అభినందనలు

విమానాన్ని సురక్షితంగా ఇజ్రాయెల్‌కు తరలించిన అనంతరం యానివ్ హయూన్ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును కలిశారు. ఈ సందర్భంగా నెతన్యాహు ఆయనను అభినందించారు. విమానంలో జరిగిన పరిణామాలను హయూన్ వివరించారు. కాక్‌పిట్‌లోకి వెళ్లి దాడి చేసిన వ్యక్తిని నియంత్రించడంలో తాను, మరో ప్రయాణికుడు, ఇతర సిబ్బంది కలిసి పనిచేశామని తెలిపారు. ఆయన చొక్కాపై రక్తపు మరకలు కనిపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

## కొనసాగుతున్న దర్యాప్తు

ఈ ఘటనకు అసలు కారణమేంటి? కో-పైలట్ ఎందుకు దాడికి పాల్పడ్డాడు? విమానాన్ని ఉద్దేశపూర్వకంగా కిందికి దించేందుకు ప్రయత్నించాడా? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. యూఏఈ పౌర విమానయాన అధికారులు ఘటనపై విచారణ చేపట్టగా.. ఫ్లైదుబాయ్ కూడా దర్యాప్తుకు సహకరిస్తోంది. ఘటనపై పూర్తి వివరాలు దర్యాప్తు పూర్తయిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ప్రాణాలు కాపాడిన ధైర్యం

తీవ్రంగా గాయపడిన పరిస్థితుల్లోనూ కాక్‌పిట్ తలుపును తెరిచి సహాయం అందేలా చేసిన కెప్టెన్ స్మిత్ మచ్చార్ చర్య.. విమానంలో ఉన్న వందలాది మంది ప్రాణాలను కాపాడటంలో కీలకంగా మారింది. ఆయనతో పాటు ప్రయాణికులు, విధుల్లో లేని పైలట్లు, సిబ్బంది సమయస్ఫూర్తితో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ.. అత్యవసర పరిస్థితిలో స్మిత్ మచ్చార్ ప్రదర్శించిన ధైర్యం, సమయస్ఫూర్తి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999